భక్తి యోగం

# మా బదరీ, కేదార్ యాత్ర



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# మా బదరీ, కేదార్ యాత్ర

కొమరగిరి అన్నపూర్ణ

# ప్రస్తావన

అనాదిగా మన దేశంలో తీర్థయాత్రలు చేసే ఆచారం వుంది నిత్యం లక్షలాది మంది ఎటో ఒకటు యాత్ర చేస్తూనే వుంటారు. అయినా మన సాహిత్యంలో యాత్రానుభవాలను వివరించే (ట్రావెలోగ్స్) గ్రంథాలు చాలా తక్కువ.

సుప్రసిద్ధమైన ట్రావలాగ్స్‌లో 'ఏనుగుల వీరా స్వామయ్యగారి కాశీయాత్ర' ఒకటి. నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ ఇదివరకు మా బావగారు అయిత రాజు రాంరావు గారు రచించిన ఉత్తర భారత యాత్రలను ప్రచురించింది. అదీ, మా అక్కగారు కొమరగిరి అన్నపూర్ణగారు రచించిన 'మా కాశీయాత్ర' బాగా ప్రచారం పొందాయి.

వంట్లో స్వస్థత తక్కువగా వున్నా, వయసు పైబడుతున్నా ధైర్య సాహసాలతో తామంతా బదరీ, కేదార్ యాత్రను ఎలా చేసి వచ్చారో ఈ గ్రంథంలో శ్రీమతి అన్నపూర్ణ వివరించారు.

ఇంత చక్కటి గ్రంథాన్ని అందించిన రచయిత్రిని అభినందిస్తూ, మీ అందరూ ఈ గ్రంథాన్ని తప్పక ఆదరిస్తారని ఆశిస్తున్నాను

**భండారు పర్వతాల రావు**

గౌరవ సంపాదకులు

నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్

# బదరీ, కేదార్ యాత్రికులు

1. శ్రీ తుర్లపాటి వెంకట పాండురంగారావు గారు,
   అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్. (మెడికల్ అండ్ హెల్త్ ట్రాన్స్‌పోర్టు)
   విజయవాడ.
2. శ్రీమతి తుర్లపాటి భారతి
   (రంగారావుగారి సతీమణి)
3. శ్రీమతి కొలిపాక శారదాదేవి
   (కొలిపాక రామచంద్రరావు గారి సతీమణి)
   మామిళ్లగూడెం, ఖమ్మం.
4. శ్రీమతి కవుటూరు సావిత్రీదేవి
   (కవుటూరి కృష్ణమూర్తి గారి సతీమణి)
   మామిళ్లగూడెం, ఖమ్మం.
5. శ్రీమతి కొమరగిరి అన్నపూర్ణ
   (కొమరగిరి వెంకటకృష్ణ అప్పారావు గారి సతీమణి)
   రచయిత్రి, పెనుగంచిప్రోలు.
6. శ్రీమతి పింగళి ప్రేమ కుమారి
7. శ్రీమతి పర్చా విమలాదేవి
   (పర్చా వెంకట హనుమంతరావు గారి సతీమణి)
   మామిళ్లగూడెం, ఖమ్మం.
8. శ్రీ తుర్లపాటి వెంకట సురేష్ బాబు,
   అడ్వకేటు. హైదరాబాదు.
9. శ్రీమతి తుర్లపాటి స్వర్ణ
   (తుర్లపాటి సురేష్ గారి సతీమణి)
10. శ్రీ కవుటూరు శేషగిరి రావు
    జర్నలిస్టు, హైదరాబాదు
11. శ్రీ కొమరిగిరి వెంకట రంగారావు
    అడ్వకేటు, విజయవాడ.

(యాత్రా సమయం 16 మే, 1996 నుండి 24 మే, 1996 వరకు)

# మా బదరీ, కేదార్ యాత్ర

మా తమ్ముడు శినప్ప (భండారు శ్రీనివాసరావు)ను చూద్దామని మేము అనుకోకుండా హైదరాబాదు రావటం తటస్థించింది భారతి, నేను కలిసి హైదరాబాదు చేరగానే అక్కడ భారతి రెండవ కోడలు స్వర్ణ మాకొక సంగతి చెప్పింది కాశ్మీరులో వున్న వైష్ణవీ దేవాలయం చాలా ప్రసిద్ధి చెందినది. ప్రస్తుతం కాశ్మీరులో వాళ్ల అన్నయ్య సైనికాధికారిగా వున్నారు బారతినీ, పాండురంగారావు గారినీ తీసికొని వైష్ణవీ ఆలయ దర్శనానికి రమ్మని ఆయన సురేష్, స్వర్ణలను ఆహ్వానించారు స్వర్ణ వాళ్లిద్దరికీ తమకూ ఢిల్లీకి రిజర్వేషన్ చేయించింది అయితే పాండురంగారావు గారికి మరో ఆలోచన వచ్చింది ఎలాగూ ఉత్తర భారతానికి వెళుతున్నాం గదా, అక్కడి నుండి బదరీ, కేదారాలు కూడా చూసి వస్తే బాగుంటుంది అని అసలు గత సంవత్సరమే బదరీ వెళ్లాలని ఆయన ఎంతో ప్రయత్నం చేశారు కాని అప్పుడు అది కుదరలేదు. బదరీ వెళ్లేందుకు యింకా కొందర్ని కలుపుకొనిపోతే సరదాగా వుంటుంది అనీ, మేమంతా కలిసి బదరీ వెళ్లాలనీ లోగడ ఆయన ఆలోచించినప్పుడు మా అబ్బాయి గోపీ (కె వి గోపాలకృష్ణమూర్తి) మీతో మా అమ్మను కూడా తీసుకొని వెళ్లండి! అందరితో కలిసి యాత్ర చేసి వస్తుంది పైకం నేను పంపిస్తాను అని పాండురంగారావు గారితో చెప్పాడుట ఆయనకు ఆ మాట గుర్తుకు వచ్చి సురేష్‌కు చెప్పి గోపీకి ఫోను చేయించాడు గోపీ "అలాగే మా అమ్మను కూడా తీసుకొనిపోండి! నేను డబ్బు పంపుతా" అని చెప్పి 'ఎంతవుతుంది? అనడిగాడట! సురేష్ ఏదో వుజ్జాయింపుగా, 'సుమారు ఏడెనిమిదివేలు కావచ్చు అన్నాడట! దానిమీద గోపీ 'నేను 12వ తేదీన హైదరాబాదు వస్తున్నాను అక్కడకు పైకం తెచ్చియిస్తాను, ఏర్పాట్లు చేసికోండి' అని చెప్పాడు ఆ విధంగా నా ప్రయాణం అనుకోకుండా ఖరారాయింది

## పద్మ పెండ్లి :

హైదరాబాదు నుండి అంతా కంభంపాడు వెళ్లాము మా మూడో

తమ్ముడు వెంకప్ప (భండారు వెంకటేశ్వర రావు) బిడ్డ పద్మ వివాహం పెండ్లిలో మేమీసంగతి చెప్పగానే, మా రెండవ అక్కయ్య (శారదక్కయ్య) కొడుకు రాజన్న (కొలిపాక రాజేంద్ర ప్రసాద్) "మా అమ్మను కూడా తీసికొనిపొండి" అని చెప్పాడు అక్కడే వున్న మా నాలుగవ అక్కయ్య (సావిత్రి అక్కయ్య) కొడుకు దుర్గాప్రసాద్ "మా అమ్మకూడా వస్తుంది మా అక్కయ్యనూ, అమ్మనూ కూడా తీసుకొనిపొండి! "- అన్నాడు అక్కడే వున్న మా చెల్లెలు ప్రేమ కొడుకు శ్రవణ్‌కుమార్ కూడా "మా అమ్మ కూడా వస్తుంది, తీసుకొని వెళ్లండి" అన్నాడు మా మూడొ అక్కయ్య (సరస్వతి) కూడా వచ్చేదే కాని మా బావగారి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆమె రావటానికి కుదరలేదు ఆవిధంగా దైవికంగా అందరికీ ఒక రకమైన ఉత్సాహం వచ్చి, మా అక్క చెల్లెళ్లందరి యాత్రలూ అలా అనుకోకుండా ఖరారయ్యాయి

## నా పరిస్థితి :

పద్మ పెండ్లి అయిన మర్నాడే కంభంపాడులో నాకు బాగా ఆయాసం వచ్చింది మాట అసలేరాలేదు ఆ రోజు ఉదయమే మా అబ్బాయి రంగడు (రంగారావు) మా టిక్కెట్ల రిజర్వేషన్‌కై ఖమ్మం వెళ్లాడు నాకేమో వంట్లో యిలావుంది నీరసం ఎక్కువైంది, మనసు పరిపరి విధాల ఆలొచించసాగింది. ఇంత నీరసంతో ఇంత కష్టమైన యాత్ర ఎలా చేస్తాను? అందులో నీరసం ఒకటే కాదాయే, ఆయాసం కూడా, ఆయాసం వస్తే అడుగుతీసి అడుగు ముందుకు వేయలేను ఇటువంటి దానిని వెళ్లి తోటి వాళ్లను ఇబ్బంది పెడతానేమో! పోనీ, నేను మానేస్తే? నా కోసం వాళ్లంతా మానేస్తారు వాళ్ల ఆరోగ్యాలు కూడా ఎవరివీ బాగాలేవు. అయినా వాళ్లు యాత్ర అన్న ఉత్సాహం కొద్దీ బయలుదేరలేదా? ఇప్పుడు నీరసంగా వుందని యీ ప్రయాణం మానేస్తే యీ యాత్ర యిక జన్మకు చేయగలనా? - ఇలా ఒకటే ఆలోచన

నాకు గుండె ఆపరేషన్ అయిన దగ్గర నుండీ ఏదో నవ్వుతూ, నవ్విస్తూ కాలక్షేపం చేస్తున్నాను ఎలాగో కాలం వెళ్లబుచ్చుకుంటూ మొత్తం మీద బండి పెట్టకుండా లాగిస్తూ వస్తున్నాను నలభైఏళ్ల నుండీ శాపగ్రస్త జీవితమే నాది

ఆయినా ఎన్ని యిబ్బంది లెదురైనా, ఎవో పుస్తకాలు చదువుతూ ,వాటి నుండి కొంత నీతిని గ్రహిస్తూ, భగవత్సంబంధమైన పుస్తకాలు చదువుతూ దేవుని పట్ల నమ్మకం పెంచుకుంటూ మొత్తం మీద సంతోషంగానే కాలం గడుపుతూ వస్తున్నాను మా కొడుకులు, కోడండ్లూ, బిడ్డలూ, అల్లుళ్లూ నాతో మనస్ఫూర్తిగా సహకరిస్తూ, నన్ను ఒక దేవతగా చూసుకుంటూ నా ఆరోగ్యం గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటూ నాకు ఏమాత్రం మనసుకు కష్టం కలగని రీతిలో సంచరిస్తున్నారు వాళ్లెంత జాగ్రత్తగా వున్నా, వంట్లో బాధలు ఎలా పోతాయి? వయసు పైబడుతూవుంది గుండె జబ్బు వల్లనో, మరి వయసు పైబడుతున్న దాని ప్రభావమో గాని ఏ కొంచెం కష్టం కలిగినా మనసు తట్టుకోలేని స్థితి ఏర్పడింది తరువాత నేనే మళ్లీతేరుకొని, నా మనసును నేనే సమాధాన పరచుకొని, శాంతపరచుకొని, ఎంతో ధైర్యంతో మళ్లీ జనజీవనంలో కలిసిపోతూవుంటాను. గత అర్ధశతాబ్దంగా నా జీవిత సరళి యిదే! ఎంత కష్టం కలిగినా, నా వరకు నేనే అనుభవించటానికి అలవాటు పడ్డాను. కాని నాబాధలు యింకొకరికి చెప్పి మిగిలిన వాళ్లను బాధపెట్టే స్వభావం కాదునాది సంతోషాన్ని తప్ప బాధను పంచిపెట్టే స్వభావం కాదు నాది ఇలా ఏవేవో ఆలోచనలతో సతమతమౌతూ వుంటే రిజర్వేషన్ దొరక్కపోతే బాగుండు, సమస్య దానంతటదే పరిష్కారం అవుతుంది - అని కూడా ఒక్కోసారి అనిపించేది

## *కిం కర్తవ్యం ?*

ఇంతలో రంగడు వచ్చి, టిక్కెట్ల రిజర్వేషన్ అయిందని చెప్పాడు ఇక నాబాధ వర్ణనాతీతం పోలె ు, ఉండలేను పెనుగంచిప్రోలు వచ్చిన దగ్గర నుండీ నా కొడుకు చందూ (చంద్రకాంతారావు), కోడలు శీమంతి నాకు తొందరగా స్వస్థత చేకూరాలని కొబ్బరిబోండాం నీళ్లు, గ్లూకోజు, హార్లిక్స్ మొదలయినవి తెచ్చి రోజూ రెండు పూటలా శ్రద్ధగా యిస్తున్నారు వ్యవధి లేదాయె ఈ వయసులో ఏంచేసినా ఒక్కవారంలో ఏం బలం వస్తుంది? కనుక తెచ్చు కోవాల్సింది మనో బలమే అందుకని, వెంటనే మా పెద్దబావ (అయితరాజు రామారావుగారు) రచించిన 'ఉత్తర భారతయాత్రలు' అనే పుస్తకం తీసి చదివాను దానిలో ఆయన తన బదరీ, కేదారాల యాత్రను కూడా వర్ణించాడు ఒక ఘట్టంలో ఆయన సోన ప్రయాగ వరకు

ప్రయాణం చేసి కూడా కేదార్ వెళ్లేందుకు ధైర్యం చేయలేక యాత్ర మానుకోవాలనుకున్నాడు అయితే దైవసంకల్పం వేరుగా వుంది తోటి ప్రయాణీకులంతా ధైర్యం చెప్పి, ఉత్సాహం కలిగించి ఆయనను కేదార యాత్రకు పురికొల్పారు దానితో ఆయన ధైర్యం తెచ్చుకొని యాత్రకు బయలుదేరాడు మా పెద్దక్కయ్య (రామారావుగారి భార్య కీ శే రాధాదేవి)ను గుర్రంపై ఎక్కించాడు గాని తాను నడచి వెళ్లగలనన్న ధైర్యంతో కాలినడకన ముందుకు సాగాడు కాని మధ్యదారిలో ఆయాసపడి, నడకసాగక చలితో బాధపడుతూ ఇక తన అవసాన కాలం సమీపించిందేమోనని ఎంతో భయపడ్డాడు అంతేగదా! వెనకటికి పెద్దలు చెప్పినట్లు

"పాము పేరు తలప చలియించు ధైర్యంబు జ్ఞానికైన మేటి మానికైన"

అదే తన విషయంలో జరిగింది - అని రామారావు బావ రాసుకున్నాడు

ఆయన పుస్తకం చదివితే ఆ ప్రయాణంలోని సాధక బాధకాలన్నీ అర్థమయినాయి వాళ్లకన్నా ఎక్కువా? అనిపించింది. నాకెందుకో? మొదటినుంచీ యాత్రలంటే ఎంతో యిష్టం ఆయా ప్రదేశాలను తిరిగి, గుడి గోపురాలను దర్శించాలని ఎంతో కోరికగా వుండేది కాని చేతనైన రోజులలో మావారు పక్కనే వున్న వేదాద్రికైనా ఎన్నడూ తీసికొని వెళ్లలేదు 'అక్కడ వున్న దేవుడు మన వూళ్లో లేడా?' అనేవారు. కాని మా వారిలో కలిగిన ఆధ్యాత్మిక పరివర్తన నాలో కలగలేదుగదా! వారి అంతస్థాయికి నేనెదుగలేక పోయినా, వారికి వలెనే నాకూ భగవంతుని యందు దృఢమైన విశ్వాసం మటుకు వుంది ఆ నమ్మకంతోనే జీవితంలో ఎన్ని కష్టాలు కలిగినా, ఎన్ని ఒడిదుడుకు లెదురయినా భరిస్తూ వస్తున్నాను. ఒక్కొక్కసారి ఓపిక చాలక భగవంతునిపై కూడా విసుగేస్తు, చికాకు వస్తుంది 'నా కష్టాలు నీవు తొలగించలేక పోయినా, వాటిని సంతోషంగా భరించే శక్తి నాకివ్వు' - అని వేడుకొంటాను ఈ యాత్ర విషయంలో కూడా ఆయనపైనే భారం వేసి వున్నాను 'నా శక్తి లవలేశం కూడా లేదు యాత్రేమో కష్టతరం. మరి, యిక ఎలా చేయిస్తావో, నీదే భారం ఈ యాత్ర చేయాలని నాకెంతో కోరిక, సంకల్పం కలిగాయి. తగిన శక్తిని నీవేయిచ్చి ఈ యాత్ర చేయించు', అని భగవంతుని పదే పదే ప్రార్థించాను

నిజానికి మా అక్క చెల్లెళ్లందరి పరిస్థితీ యిదే! అందరికీ ఆయన శక్తి యిస్తేనే పోయి రాగలుగుతాం యాత్రలు చేయాలంటే మామూలు మాటా! ప్రయాణ ఖర్చులు వేలల్లో వుంటాయి, పిల్లలను ఎవర్నడిగి ఎవర్ని యిబ్బంది పెట్టటం నాకిష్టం ఉండదు భగవంతుని దయ వలన గోపీ లోగడే యీ యాత్రకు పైకం యిస్తానన్నాడు గనుక అది గుర్తుంచుకొని సురేష్ ఫోన్ చేయగానే వాడు నాకు ఫోన్ చేసి యాత్రకు వెళ్లి రమ్మని ప్రోత్సహించటం వల్ల నా ప్రయాణం ఖాయమయింది. ఏది ఏమైతేనేం, దేవుని అనుగ్రహం, మాకు యాత్ర చేసే ప్రాప్తం వున్నాయి కనుక అధైర్యం విడిచిపెట్టి మనోబలం తెచ్చుకొని యాత్ర చేసి రావటానికే నిర్ణయించుకొన్నాను

# ప్రయాణానికి నాంది :

ఎండలు విపరీతంగా వున్నాయి వడగాడ్పులు ఎక్కువైనాయి ఆరోగ్యంగా వున్నవాళ్లనే ఒక వూపు వూపి వదిలేలా వున్నాయి ఎండలు ఇక ఆరోగ్యం బాగా దెబ్బతిని వున్న నాలాటి వాళ్ల పరిస్థితి వేరే చెప్పాలా? నీరసం ఎక్కువైంది అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నా. శీమంతే నా పెట్టె సర్దిపెట్టింది

ఇంత మంది పెద్ద వాళ్లను వెంట బెట్టుకొని యింత పెద్ద యాత్రను తలపెట్టటంతో సురేష్ కాస్త వెనుకాడి తోడింకా ఎవరైనా వుంటే బాగుంటుందని రంగడిని ప్రయాణానికి సిద్ధం చేశాడు అదీగాక, భారతీ వాళ్లు నలుగురూ ముందే వైష్ణవీ యాత్ర కోసం ఢిల్లీకి వెళుతున్నారు మమ్మల్ని తరువాత తీసికొని వెళ్లి వాళ్లకు జతచేసి వచ్చేవాళ్లొకరు కావాలిగదా! 'ఎలాగూ ఢిల్లీ దాకా వస్తున్నావుగదా, కేదారు కూడా రా!' - అన్నాడు

'యాత్రలకు ఎంతవుతుంది?' - అని గోపి అడిగినప్పుడు - అప్పటికి యింత అని కచ్చితమైన లెక్కలు వేసికోనందువలన సుమారుగా ఏడెనిమిది వేలవుతుందని చెప్పటం జరిగింది గోపీ ఎనిమిది వేలిచ్చాడు తరువాత లెక్కలు వేస్తే మనిషికి అయిదారు వేలు చాలేమో ననిపించింది అందుకని రంగడి ఖర్చులు కూడా అందులో సరిపుచ్చవచ్చునుకొన్నారు అలా రంగడి ప్రయాణం ఖరారయింది

ఇంతలో దుర్గాయ (దుర్గాప్రసాద్) శేషును (సావిత్రక్కయ్య ఆఖరు కొడుకు శేషగిరిరావు) కూడా సావిత్రక్కయ్య వెంట తోడుగా వెళ్లి రమ్మన్నాడు అలా శేషు బయలుదేరాడు

మా పెద్దబ్బాయి రామచంద్రానికి (కె యస్ రామచంద్రమూర్తి) యిదంతా వివరంగా వుత్తరం రాద్దామని అనుకున్నాను గాని ఎండదెబ్బకు ఏమాత్రం ఓపిక లేకపోయింది నాకోసం వాడు, వాళ్ల ఛైర్మన్ జంధ్యాల రఘుగారు కూడా హైద్రాబాదుకు రెండుమూడు చోట్లకు ఫోన్ చేశారట కాని వాళ్లు ఒక యింటికి ఫోన్ చేస్తే నేనక్కడ కాక మరొక యింట్లో వుండటం తటస్థించింది

## హైదరాబాదుకు :

ఇంతలో నాకు రేడియో ప్రోగ్రాం వుండటంతో రికార్డింగ్ కని ముందుగానే హైదరాబాదు చేరుకోవలసి వచ్చింది. నేనూ రంగడు 13వ తేదీన రాత్రికే పెనుగంచిప్రోలు నుండి హైదరాబాదుకు బయలుదేరాము యాత్రకు వెళ్లేముందు పెద్ద వాళ్లకు దణ్ణంపెట్టి, బయలుదేరుదామంటే ఇంట్లో పెద్దవాళ్లెవరున్నారు? ఎలాగో ఓపిక తెచ్చుకొని జగన్నాధం బాబాయి యింటికి వెళ్లి ఆయన భార్యకు దణ్ణం పెట్టి ఆమె ఆశీర్వాదం తీసుకున్నాను విశాఖపట్నం నుంచి మా పెద్దబ్బాయి రామచంద్రం బిడ్డ దీప వచ్చింది అది, చందూ పిల్లలు సంక్రాంత్, ఉషలతో కలిసి నందిగామ వెళ్లి మా అయిదవ అబ్బాయి రఘురాం కొడుకునూ, బిడ్డనూ చూచి కోదాడు మా అమ్మాయి యింటికి వెళ్లింది. వెళ్లేముందు పిల్లలు 'ఏమైనా సరే! మేం వచ్చేదాకా నీవు యాత్రలకు బయలుదేరవద్దు' అని పదేపదే చెప్పి పోయారు. కాని రంగడు విజయవాడ వెళ్లివస్తూ నందిగామలో హైద్రాబాద్ టిక్కెట్లు రిజర్వుచేయించు కొని వచ్చాడు మా ప్రయాణం గంటలలోనికి వచ్చింది. ఇప్పుడింక భయపడినా ఏం ప్రయోజనం లేదు అంతా భగవత్సంకల్పం ప్రకారమే జరుగుతుంది మన చేతిలో ఏమీలేదు ఈ ప్రయాణం అంతా ఏదో కలలోలాగా మన ప్రమేయం లేకుండా జరుగుతోంది ఇలాటి యాత్ర నాకు సాధ్యమవుతుందా? నా వంటి పరిస్థితిని బట్టి పిల్లలెవరూ ఈ యాత్రకు ఒప్పుకునే అవకాశం లేదు. అయినా దైవసంకల్పం వల్ల

అదృష్టవశాత్తూ వాళ్లంతా అంగీకరించారు డబ్బు గోపీ యిచ్చాడు రంగడు తోడు వస్తున్నాడు భగవంతుడు యీ ఏర్పాట్లన్నీ అయాచితంగా చేసినప్పుడు. నేను ఎంతో దీనంగా నేను యాచించిన ప్రయాణంచేసే శక్తిని నాకు ఇవ్వడా? నాలో మొండి ధైర్యం ప్రవేశించింది `నా భారమంతా నీదే, తండ్రీ! అని ఆయనకే మళ్లీ నమస్కారంచేసి `మనోజవేన మాండవ్యం అనుకొని బయలుదేరాం రఘురాం నాకు దగ్గరుంచుకోమని వేయి రూపాయలిచ్చాడు. లక్ష్మణరావు బస్సు ఎక్కించ టానికి వచ్చి `క్షేమంగా వెళ్లిరా వదినా. చాల బలహీనంగా వున్నావు` అన్నాడు రఘు. చందు, శీమంతి - అంతా `బాగా నీరసంగా వున్నావు, జాగ్రత్త! అని చెప్పారు అక్కడ నుండి నందిగామవచ్చి కోడలును (రఘురాం భార్య) పిల్లలను చూసి హైదరాబాదు బస్సెక్కాము మర్నాడు ఉదయం 5 గం॥ కల్లా హైదరాబాదు చిక్కడపల్లిలో వున్న నరసింహారావు గారు, మణి (ప్రేమ అల్లుడూ, బిడ్డ) ఇంటికి చేరుకున్నాము

## వైద్య సలహా :

మేము హైదరాబాదు వచ్చి తమయింట్లో దిగినందుకు మణి. మణి అత్తగారు వాళ్లంతా ఎంతో ఆనందపడ్డారు అక్కడ నుండి మా యాత్ర హడావుడి మొదలయింది ఉదయం స్నానాలయే సరికి మణి వేడివేడి దోసెలతో ఫలహారం పెట్టింది అక్కడ నుంచి మనోహర్ (మా పెద్దక్కయ్య కొడుకు, డాక్టర్ ఎ వి మనోహర్ రావు) యింటికి వెళ్లాము. నేను, ప్రేమ పరీక్ష చేయించుకున్నాము ప్రేమకు బి పి చూసి ఏదో అనుమానించి `మళ్లీ రేపొకసారి రా!` అన్నాడు. మాతోపాటు రంగడు కూడా వచ్చి మనోహరుతో తనుకూడా పరీక్ష చేయించుకున్నాడు వాడు కూడా ఈ మధ్య కోయంబత్తూరు వెళ్లి అక్కడ పదిహేను రోజులుండి వచ్చాడు అక్కడ భోజనం సరిపడకనో, ఎండల వల్లనో గాని బాగా నీరసంగా వున్నాడు దానికితోడు మెడనరం పట్టిందని మెడసరిగా తిప్పలేక పోతున్నాడు మనోహర్ వాడికి ఏమీ లేదని చెప్పి అవసరానికి అందరికీ పనికివచ్చే మందులు. గ్లూకోజు. ఎలక్ట్రాల్ పొడరు లాటివి దగ్గరుంచుకోవలసిందిగా రాసి యిచ్చాడు తరువాత మేం శీనప్ప దగ్గరకు వచ్చి వాడిని చూశాము.

నాకు 23న రేడియో ప్రోగ్రాం వుంది అయితే 23కు నేను హైద్రాబాదులో వుండను గదా! అందుకని శినప్ప రేడియో స్టేషన్‌కు ఫోన్‌చేసి ప్రోగ్రాం 14వ తేదీ మధ్యాహ్నాం 3 గం॥కు రికార్డింగ్ చేసే ఏర్పాటు చేశాడు

మనోహర్ యింటినుండి వస్తూ ప్రేమ, నేను డాక్టర్ నాగభూషణంగారి దగ్గరకు వెళ్లాము నేనెలాగూ ఆయనతో మధ్యమధ్య చెకప్ చేయించుకొంటుం డాలి అలాగే వెళ్లి ఆయనకు మా బదరీ-కేదార్ యాత్ర సంగతి చెప్పి 'వెళ్లవచ్చా?' అనడిగాను దానికి ఆయన నవ్వి 'మీ అక్కచెల్లెళ్లంతా కలిసి వెళితే బదరీ కేదారేమిటి. మానస సరోవర్ యాత్రయినా చేసిరాగలరు మీ మనోబలం అలాటిది మీ పెద్ద అక్కయ్య కూడా సుస్తీని లెక్క చేయకుండా ప్రయాణాలు చేసేది అందుకని మీరంతా కలిసి ప్రయాణాలు చేస్తుండటమే మీకు మందు వేరే మందులు మీకవసరంలేదు మీరు ధైర్యంగా ప్రయాణం చేయవచ్చు. నిశ్చితంగా వెళ్లిరండి!" అని చెప్పారు అంతేకాక, కేదార్ యాత్రలో బాగా ఎత్తుకు వెళుతున్నప్పుడు వేరే బాధలు కలక్కుండా తనదగ్గరవున్న మందులిచ్చి వేసుకోమన్నాడు ప్రేమకు బి.పి. కొంచెం వుందన్నాడు. అయినా ఏం భయం లేదు వెళ్లిరమ్మని ధైర్యం చెప్పాడు. చికిత్స చేస్తాడు గాని ఫీజు మాత్రం ససేమిరా తీసుకోడు బతిమిలాడితే 'అయితే నన్నూ, మీ రంగారావును భేదంగా చూస్తున్నారా' అంటాడు అసలు పేషంట్లకు ఆయన గారి మాటలతోనే సగం సుస్తీ తగ్గిపోతుంది. మిగతా సగం తగ్గేట్లు మందు వాడతాడు. ఏ డాక్టరు చూసినా, ఆయన చూస్తేనే గాని మాకు నమ్మకం కుదిరేది కాదు

## గోపీ జాగ్రత్తలు :

డాక్టరు గారిని కలిసివస్తూ కోదాటి నారాయణ రావుగారి యింటికి వెళ్లి కనపడి, తిరిగి మణి యింటికి వచ్చాను తాను ఎనిమిది, తొమ్మిదింటికల్లా వస్తాననీ, మమ్మల్నెటూ పోవద్దనీ మా గోపీ ఫోన్ చేశాడు మేము యింటి దగ్గరకు చేరిన కాసేపటికల్లా గోపీ వచ్చాడు నన్నూ, ప్రేమనూ కూర్చోబెట్టుకొని ఎన్నో జాగ్రత్తలు తెలిపాడు ముఖ్యంగా అడ్రసు కాగితాలు రాసుకొని అంతా దగ్గర పెట్టుకోవాలని

చెప్పాడు ఆహారం సరిగా తీసుకోవాలని, కొబ్బరి బొండాలు, పండ్లు తీసుకొంటుండాలి అన్నాడు కేదారుయాత్రలో గుర్రాలెక్కటం చేతకాకపోతే, రిస్కు తీసుకోకుండా కిందనుంచే దణ్ణం పెట్టి వెనక్కి వచ్చేయమని చెప్పాడు ఎనిమిది వేల రూపాయలు కవర్లో పెట్టి నాకిచ్చి అందులో ఒక వేయి నాదగ్గరుంచుకొని, తక్కినవి రంగడికి యిమ్మన్నాడు ఆ రోజు అక్కడే భోజనం చేసి కాసేపు మాతో వుండి వెళ్లాడు. వాడు హైద్రాబాద్‌కు ఆఫీసు పనిపై ఏదో ట్రయినింగ్ కోసం వచ్చాడుట. మర్నాడు రావటానికి కుదరదని ఆ రోజే పదకొండింటిదాకా వుండి మాట్లాడి వెళ్లాడు.

## ఫణి, మణి సప్లయిలు :

మా యాత్ర గురించి మా చెల్లెలు ప్రేమ బిడ్డలు ఫణి, మణి పడిన హడావుడి ఇంతా అంతా కాదు. ఫణి చక్కిలాలు, కారప్పూస, కర్జికాయలు, వేయించిన అటుకులు, పెరుగన్నం పొట్లాలు, పూరీలు, కూర, పచ్చళ్లు అన్నీ ప్యాకింగ్ చేసి యిచ్చింది శారద మామిడి పండ్ల రసం యిచ్చింది మణి, లక్ష్మి వెళ్లి ప్రేమకు గాజులు తెచ్చారు నాకు చెప్పులు, యింకా అవసరమయ్యే సామాన్లు తెచ్చారు ప్రేమ బంగారపు గాజులు దాచి, ముందు జాగ్రత్తగా లక్ష్మి తెచ్చిన గాజులు వేసుకొంది రంగడు వెళ్లి పేస్టు, కొబ్బరినూనె, తనకు పౌడరు, షాంపూ, నా మందులు అవీ తెచ్చాడు మధ్యాహ్నం ఫణి యింట్లో భోజనాలు

ఈలోగా మనోహర్ తన కారిచ్చి ఒకసారి అందరి యిండ్లకూ వెళ్లి చూసి రమ్మని పంపాడు. నేను, ప్రేమ, మణి అత్తగారు కలిసి ఆ కారులో బయలుదేరాము. బాబు (మాపెద్ద తమ్ముడు పర్వతాలరావు) యింటికి వెళ్లాము. 'భగవంతుడు మీ వెంట సాయంగా వచ్చి, అన్నీ చూపించి క్షేమంగా తీసుకొని వస్తాడు. భయంలేదు, వెళ్లి రండి!' - అని బాబు అని, బాబు, సరోజినీ మాకు దణ్ణాలు పెట్టారు తాను ఏవన్నా తినుబండారాలు మాకు చేసివ్వలేక పోయానని సరోజిని బాధపడుతూ వున్నది. దాని వంట్లో బాగుండటం లేదు వాణి పురుడూ అదీ. అయినా అప్పుడు 'ఏదో వొకటి చేసిస్తాను వుండండి' అంటుంది 'పోనీ అటుకులు వేయించి యిస్తానంది' దాని పరిస్థితి గమనించి నేనే 'వేయించక్కర్లేదులే నువ్వంత బాధ

పడటం ఎందుకు? పచ్చి అటుకులే యివ్వు, మేం దారిలో తింటాం' - అని చెప్పాను మా అమ్మతో కలిసి కాశీనుంచి వచ్చేటప్పుడు పెరుగులో అటుకులు వేసుకొని తినేవాళ్ళం అలాగే తింటాం అని చెప్పాను నిజంగా మా అక్క చెల్లెళ్లం అందరం ఎంతో అదృష్టవంతులం అనుకోవాలి. తమ్ముల యిండ్లకు వెళ్ళినా, అక్క చెల్లెండ్ర యిండ్లకు వెళ్ళినా అందరి పిల్లలూ మనస్ఫూర్తిగా గౌరవించి, ఆపేక్షపడతారు. నిరుడు మా బదరీ ప్రయాణం సాగివుంటే బాబు, సరోజిని, సరసక్కయ్య, హనుమంతరావు బావ కూడా మాతో వచ్చివుండేవారు అందులో యిటువంటి యాత్రలంటే మా సరసక్కయ్యకూ, సరోజినికీ ఎంతో యిష్టం అంతా వచ్చి నమస్కారాలు చేశారు అమ్మలు (మాదిరాజు సరస్వతి వదినె (రేజెర్ల) కుమార్తె ప్రమీల) కూడ వచ్చి నమస్కారం చేసి వెళ్లింది 'మీరెంతో అదృష్టవంతులు అత్తయ్యా! చక్కగా యీ వయసులో కూడా యిలాటి యాత్రలు చేసివస్తున్నార'ని ఎంతో సంతోషపడింది వాణి (మా పెద్ద తమ్ముని మూడో అమ్మాయి) వచ్చి నమస్కారం చేస్తూ 'మాతరపున కూడా నమస్కారం చెప్పు, అత్తయ్యా!' అంది. 'మీ అందరి పేరు పేరునా సహస్ర నామాలు మొదలెడితే, యిక నాదణ్ణం ఎప్పుడే?' - అన్నాను వెంకటేశ్వరరావు బావ (మా మేనమామ కొడుకు) యింట్లో చెప్పి, సరోజినిని వదిలి పెట్టలేక, వదలి, రంగడి (మా పెద్దక్కయ్య పెద్దకొడుకు డాక్టర్ ఎ పి రంగారావు) యింటికి వచ్చాము. అక్కడ మా పెద్దబావ అయితరాజు రామారావు గారికి నమస్కారం చేశాము. ఆయన పరిస్థితి హృదయ విదారకంగా వుంది వృద్ధాప్యం ఎంత ఘోరమో తెలిసింది. అన్ని విధాల ఆయనకు రాజభోగాలు జరిపే కొడుకులు, ఎంతో ఓపికగా, శ్రద్ధగా సపర్యలు చేసే కోడళ్లు, అడుగువేస్తే అలసిపోతాడేమోనని అదుర్దాపడే ఆడపిల్లలు, అల్లుళ్లూ, మనవలూ, మనవరాండ్రూ డాక్టర్లూ, అడుగడుగునా అహర్నిశలూ కనిపెట్టుకొని సేవలు చేసే పనివాళ్లూ - ఇన్ని సదుపాయాలున్నా, ఏవీ తనకు పట్టనట్లు కేకలు పెడుతున్న పెద్దబావను చూస్తుంటే చాల బాధవేసింది ఏం చెయ్యగలం? బరువైన హృదయంతో బయలుదేరి శారద యింటికి వచ్చాము అలస్యం అవుతుందని మనోహర్ కారు పంపేశాం శారద అత్తగారికి ఆపరేషన్ చేశారట! అందుకని వారిని పరామర్శించి, ఆ పుణ్యదంపతులకు నమస్కారంచేసి అటొలా ఫణి యింటికి చేరుకున్నాము

అక్కడ భోజనాలు చేసి మణి యింటికి చేరేసరికి రెండున్నరయింది ఇంతలో రేడియో స్టేషన్ నుంచి దుర్గ (మాతమ్ముడు శ్రీనివాసరావు భార్య), హేమ (మా మేనల్లుడు సుభాష్ చంద్రబోస్ భార్య) ఫోన్‌చేసి త్వరగా రండి! రికార్డింగ్ చేయాలి. అని గుర్తుచేశారు. అప్పుడు నేను మణి తోటికోడలు సరోజినితో కలిసి రేడియో స్టేషన్‌కు వెళ్లాను అక్కడ అంతా రడీగా వుంది మా కోసమే ఎదురు చూస్తున్నారు నేను ముందు కృష్ణ శతకం చదివాను కాస్త నీరసం అనిపించింది. హార్మణీ పెట్టటంతో అంతగా తెలియలేదు కాస్త స్తిమితపడి నరసింహ శతకం చదివాను అది ఇంకా బాగా వచ్చిందన్నారు మొత్తం మీద రేడియో ప్రోగ్రాం రికార్డింగ్ కూడా కానిచ్చుకొని శీనప్ప దగ్గరకు వెళ్లాము వాడితో చెప్పి కాసేపు వాడిదగ్గర కూచున్నాం, వాడిని చూస్తుంటే చాలా బాధ అనిపించింది కాసేపు కూడ ఒకచోట వుండని వాడు అలా ఇరవైరోజుల నుండీ మంచంపై కట్టిపడేసినట్లు ఆవిధంగా పడివుండటం ఎంతకష్టమో! పైగా ఎండాకాలం స్నానం లేదు వడగాలి, వళ్లు చిటపటలాడుతూ అలాపడుకునే వుండాలి గదా! ఎందుకు ఆ చిన్నవాడికి భగవంతుడంత శిక్ష వేశాడో?

## వీడుకోలు :

అప్పటికే సాయంకాలం నాలుగయింది తొందరగా మణి యింటికి చేరుకున్నాము అక్కడికి మణి ఆడుబిడ్డ సావిత్రి వాళ్లు అంతా వచ్చారు వాళ్ల ఇల్లంతా కోలాహలంగా వుంది సాయంకాలం ఆరింటికి స్నానం చేసి గబగబా యింత.మజ్జిగ అన్నంతిని మణి అత్తగారికి నమస్కారం చేశాను దణ్ణాల తతంగం తొందర తొందరగా కానిచ్చి అంతా నాలుగు ఆటోలలో రైలు స్టేషన్‌కు చేరుకున్నాము కాని అప్పటికి ఇంకా శారదక్కయ్య, సావిత్రి జాడలేరు. మేం గబగబా రైలు దగ్గరికి వెళ్లి మా కంపార్టు మెంటులో ఎక్కి కూచున్నాం తరువాత టిక్కెట్లు తీసికోవడం వల్ల శారదక్కయ్యకు, విమలకు ఫస్టుక్లాసులో బెర్తులు దొరికాయి. వాళ్లు రాగానే రంగడు వాళ్లను తీసికొని వెళ్లివాళ్ల కంపార్టుమెంటులో కూర్చోబెట్టి వచ్చి మాతో చెప్పాడు సరిగా రాత్రి 8 గం॥కు రైలు నాంపల్లి స్టేషన్ వదిలింది.

సికింద్రాబాదులో శారదక్కయ్య కొడుకు మురళి (బాల మురళీ కృష్ణ) వచ్చి కలిశాడు `మా అమ్మను ఎంత వద్దన్నా వినకుండా చిన్నపిల్లలా మారాం చేసి యాత్రలకు బయలుదేరి వచ్చింది, చివరకు చేసేది లేక అందరం వొప్పుకొని పంపిస్తున్నాం, జాగ్రత్తగా వెళ్ళిరండి! - అంటూ మా అందరికీ నమస్కారం చేసి వెళ్లాడు అక్కడి నుండి రైలు నెమ్మదిగా బయలుదేరి, వేగం పుంజుకొని కాజీపేట దిశగా సాగిపోసాగింది

రైలు బయలుదేరగానే మేమంతా సర్దుకొని కూర్చున్నాము రంగడు, శేషు కలిసి కొంత సామాను వాళ్ల దగ్గరికి చేర్చారు మేమంతా ప్రయాణం సంగతులు మాట్లాడుకుంటూ కూర్చున్నాం కాని రంగడు మాత్రం తిరుగుతూనే వున్నాడు మాటల్లోనే రైలు రాత్రి 12 గం॥కు కాజీపేట చేరింది అక్కడికి ప్రేమ బిడ్డ జయ, శర్మగారు వచ్చారు వాళ్ల తమ్ముడికి సుస్తీగా వున్నందున వాళ్లు వాళ్ల తమ్ముడి దగ్గరకు (భీమవరం) వెళ్లారు అది చాలా దూరం, అయినా కేవలం మేం యాత్రలకు వెళ్లేముందు కనుపించి దణ్ణం పెట్టటం కోసం అంతదూరం నుంచి అర్ధరాత్రి అయినా రైలు దగ్గరకు వచ్చారు ఇంతలో రవి (విమల కొడుకు) ఫలహారాల బ్యాగ్ తీసుకొని వచ్చాడు విమల పిండి వంటలు చేసి బ్యాగులో సర్దిపెట్టి, హడావుడిలో యింట్లోనే పెట్టి మరచి వచ్చింది. అదిచూసి రవి కాజీపేటకు తెచ్చి అందించాడు అక్కడ రైలు చాలసేపు ఆగటంతో రవి, రంగడు, శేషు వెళ్లి టి.సి.తో మాట్లాడి వచ్చి 'రండి! మీకు ఎ.సి.లో సీట్లు దొరికాయ`ని చెప్పారు అప్పుడు గబగబా సామన్లన్నీ తీసుకొని దాదాపు ఆరుడబ్బాల అవతల వున్న ఎ సి కోచ్ వద్దకు పోయి ఎక్కాము మొత్తం మీద మా అయిదుగురికీ బెర్తులు దొరికాయి శారదక్కయ్య, విమల మాత్రం ఆరాత్రికి ఫస్టు క్లాస్‌లోనే పడుకున్నారు ఆ తరువాత అందరం పూరీలు తిని పడుకున్నాం. జయతో అంతకుముందే కాజీపేటలో మాకు ఏ సి లో బెర్తులు దొరికాయనీ, ఏ యిబ్బందీ లేకుండా ప్రయాణం సాగుతున్నదనీ హైద్రాబాదుకు ఫోన్‌చేసి చెప్పమన్నాము రవిని ఖమ్మంలో చెప్పమన్నాము ఆ విధంగా మా యాత్రలో మొదటి రాత్రి గడిచిపోయింది

# రైల్లో రెండవ రోజు :

ఉదయం 5 గం॥కే మాకు మెలకువ వచ్చింది మొహాలు కడుక్కుందా మనుకుంటే పేస్ట్ వున్న సంచీ రంగడి దగ్గర వుంది అందుకని వూరుకున్నాము నేనేదో రాసుకుంటూ కూర్చున్నా ఇంతలో సేవాగ్రాం స్టేషన్ వచ్చింది ఆ బోర్డు చూడగానే మహాత్మాగాంధి, ఆయన నివసించిన సేవాగ్రాం ఆశ్రమం గుర్తుకు వచ్చాయి. ఉదయం 7 గం॥కు నాగ్‌పూర్ స్టేషన్ వచ్చింది అక్కడ మా మేనమామ బిడ్డ చంద్రమతి ఉంది ముందుగా ఫోన్‌చేసి చెబితే స్టేషన్‌కు వచ్చేదేమోననుకున్నాము. నాగపూర్‌లోనే రామప్ప (భండారు రామచంద్రరావు, ప్రస్తుతం న్యూయార్కు (యు యస్ ఎ.)లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డౌన్‌టౌన్ సర్వీస్ బ్రాంచికి సీనియర్ వైస్ ప్రెజిడెంట్‌గా వున్నారు), సీతారామరావుగారు (రావులపాటి సీతారామారావుగారు, హైద్రాబాద్ రేంజి డి ఐ జి గా వున్నారు), రామచంద్రం (కె.యస్ రామచంద్ర మూర్తి, శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంక్ సీనియర్ అధికారి) అంతా అక్కడే చదివారు. ఆ సంగతి గుర్తు వచ్చింది సందీప్ (భండారు శ్రీనివాసరావు పెద్ద కొడుకు), కిన్నెర (జ్వాలా నరసింహారావు గారి రెండవ కుమార్తె) రాంటెక్‌లో ఇంజనీరింగ్ చదువు తున్నారు ముందుగా ఫోన్‌చేస్తే రాంటెక్ ఇక్కడికి దగ్గరే కనుక నాగపూర్ స్టేషన్‌కు వచ్చేవాళ్లే - అనుకున్నాం కాసేపు నేను, సావిత్రి కలిసి విమల, శారదక్కయ్య వున్న డబ్బా దగ్గరికి పోయి వాళ్లతో కబుర్లు చెప్పివచ్చాము, ఇంతలోనే శేషు వచ్చి మా అందరికీ కాఫీలు తెప్పించాడు అందరం కాఫీ తాగి కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాము సరసక్కయ్య మాత్రం మాకు అడుగడుగునా గుర్తుకు వస్తుండేది ఆమె మాతో వచ్చి వుంటే, కంపార్టుమెంటులో మేము కూచున్న కుపే అంతా నీటుగా సర్ది వుంచేది - అనుకున్నాం

క్రమంగా పొద్దెక్కుతూంది 11 గంటలు దాటేసరికి ఎండ, వడగాడ్పు ఎక్కువయాయి మాకు ఏ/సిలో సీటు దొరకటం వల్ల ఎండ బాధలేక ప్రయాణ బడలిక తెలియట్లేదు మాతో తెచ్చుకున్న ఫలహారాలను ఎవరికి కావలసినవి వాళ్లు వడ్డించుకొని తిన్నాం పాపం, శారదక్కయ్య, విమల ఎండకెలా వున్నారో అనుకుంటుండగా రంగడూ, శేషూ వాళ్లను కూడా తీసికొని మా డబ్బాలోకి వచ్చారు మా యెదురుగా వున్న బెర్తులలో కూర్చున్న మగవాళ్లిద్దరు నాలుగింటికి ఇటార్సిలో

దిగటంతో ఆ రెండు సీట్లను శారదక్కయ్య. విమలకు ఇచ్చారు భగవంతుని దయవల్ల అలా అందరం ఒకచోటికే చేరాము నిన్న తలావొక చోట కావటంతో అంత ఉత్సాహంగా లేకపోయింది కాని యివాళ అంతా ఒకచోటికి రావటంతో మా అందరిలో నూతనోత్సాహం చోటుచేసికొంది సాయంత్రం మాతో తెచ్చుకున్న అల్పాహారం తీసికొని కాఫీతాగాము. రంగడు, శేషు ఏర్పాట్లలో బాగా అలసి పోయారు పాపం! పడుకొని గాఢనిద్రలో మునిగిపోయారు. విమల ఏవేవో విశేషాలు దేవుళ్లను గురించీ మంత్రాలను గురించీ చెబుతోంది అందరం ఆసక్తిగా వింటున్నాం పొద్దుగూకింది రాత్రి 8 గం॥కు అంతాతలావొక మామిడి పండు తిని మాట్లాడుతూ కూచున్నాము పదిగంటల తర్వాత తలా కాసిని మజ్జిగ తాగి మందులు వేసికొని నిద్రపోయాము రైల్లో రెండవరాత్రి ఆ విధంగా గడిచింది ఉదయం మేం లేచి మొహాలు కడుక్కున్నాం మా కంపార్టుమెంటులో అంతా లేచి హడావుడిగా సర్దుకుంటున్నారు ప్రేమ "వాళ్లంతా సర్దుకుంటున్నారు, ఢిల్లీ వచ్చినట్లుందే!" - అంటున్నది శారదక్కయ్య "ఢిల్లీలో యిలా ఖాళీస్థలాలుంటాయా? ఇది ఢిల్లీ కాదోమో!" - అన్నది ఇంతలో రంగడు, శేషు వచ్చి 'దిగండి! ఢిల్లీ వచ్చింది!' - అంటే అంతా గబగబా అన్నీ సర్దేసుకొని సామాన్లు తీసుకొని దిగాము అక్కడ అంతా హిందీ తప్ప మన మాట వినిపించదు రంగడు. శేషు ఒక టాక్సీని రు. 100లకు మాట్లాడారు అందరం కలిసి అందులో హోటల్ ఇండియాకు వెళ్లి అక్కడ మాకిచ్చిన గదులలోకి వెళ్లాము, కాఫీలు తాగి, స్నానాలు చేశాము పద కొండింటి దాకా రెస్టు తీసికొని ఆంధ్రాభోజనం పెట్టేహోటలుకు వెళ్లి భోజనాలు చేశాం. ముందు ప్లేట్లు పెట్టుకుంటే శేషు 'బాగుండదు! వద్దు' అన్నాడు, హోటల్ వాళ్లు కంచాలు తెచ్చి పెట్టారు. నాకు ఇది వరకు కంచంలో వడ్డిస్తే అందులో యిదివర కెవరెవరు తిన్నారో అనిపించి తినబుద్ధి అయేదిగాదు. ఒకసారి శీనప్ప వాళ్లయింట్లో కంచాల ప్రసక్తి వచ్చింది అప్పుడు శీనప్ప 'వాళ్లు తిన్న కంచం, వీళ్లు తాగిన గ్లాసు అనుకోవటం వల్ల మనసు పరిపక్వంగాదు అందరూ భగవత్స్వరూపులే అనుకున్నప్పుడు ఆ తేడా రాదు మన మనసుకు అలాటి తేడాను రానివ్వ కూడదు అని చెప్పాడు శారదక్కయ్య కూడ ఆ మాటే చెప్పింది అందుకని ఆ రోజు నుంచి ఆ తెడాను తీసేసుకొని ఏ కంచంలోనైనా తింటూనే వున్నాను కనుక ఈ రోజు

హోటలులో 'కంచం పెట్టారే' అన్న భావన మనసులోకి రానీయకపోయే సరికి భోజనం తృప్తిగా చేయగలిగాం. మేము వెంట తీసికొని వెళ్లిన పొడులూ, పచ్చళ్లూ కూడా వుండటంతో కడుపునిండా తినివచ్చి హోటల్ రూంకు వచ్చి పడుకున్నాము. బయటకు వెళ్లి ఎటయినా తిరిగి, ఏదయినా చూసివద్దామనుకుంటే బయట విపరీతమైన ఎండ, వడగాలి! అందువల్ల రూంలోనే పడుకొని నిద్రపోయాం.

మేము స్టేషన్ నుంచి టాక్సీలో వచ్చేటప్పుడు రంగడు 'ఇదే ఇండియా గేటు' అని చూపించాడు. ఢిల్లీలో మేం చూసిన విశేషం అదే!

రంగడు, శేషు మమ్మల్ని పడుకోమని చెప్పి బయటకు వెళ్లారు. వెళ్లేటప్పుడు లోపల తలుపుకువేసే తాళంవేసి కింది రూంలో నుండి వెళ్లారు. మేం నిద్రపోయి లేచేవరకు నాలుగయింది. ఎవరో తలుపుకొడుతున్నారు. తలుపు తీద్దామంటే తాళం రావట్లేదు. ఆ గదికి చిన్న కిటికీ కూడ లేదు. కింది గదిలో విమల, ప్రేమ పడుకున్నారు. పైగదిలో నేను, శారదక్కయ్య, సావిత్రి పడుకున్నాం. మూడవ అంతస్థులో రంగడు, శేషు పడుకున్నారు.

ఎంతకూ తాళం రాకపోతే మాకెంతో భయంవేసింది, కాని పైన మా గదిలో నుండి కింద ప్రేమ వాళ్లున్న గదిలోకి ఇనపమెట్లున్నాయి. అది మా అదృష్టం. వెంటనే కిందికి దిగి వెళ్లాం. విమల తాళం తీసింది. 'బతుకుజీవుడా!' అని వూపిరి పీల్చుకున్నాము.

ఉదయం ఆ రూంలో దిగగానే యిలాటిదే యింకో సంఘటన జరిగింది. అంతా స్నానాలు చేసి సోఫాల్లో కూర్చొని చదువు కుంటున్నాము. దానికి దగ్గరలోనే ఒక కూలర్ వుంది. ఇంతలో నా చీరె పమిటెచెంగు గాలికి ఎగిరి వెళ్లి ఫ్యాన్‌లో చిక్కుకుంది. వెంటనే ఎందుకోగాని, కూలర్ ఆగిపోయింది. అది చూసి నా కేదయినా షాక్ కొడుతుందేమోనని ప్రేమ కంగారుగా పెద్దకేక పెట్టింది. కాని భగవంతుని దయవల్ల నాకు షాకూ తగల్లేదు, చీరా చినగలేదు.

వచ్చేటప్పుడు అమ్మ ఫోటోకు, రాధక్కయ్య ఫోటోకు దణ్ణం పెట్టుకొని వచ్చాము. అందుకే భగవంతుడు మా కిలాటి స్వల్పమైన సంఘటనలు జరిగినా, ఏ అపాయం లేకుండా కాపాడుతూ వస్తున్నాడు.

సాయంకాలం అంతా స్నానాలు చేశాం బజారుకువెళ్లి కాసేపు తిరిగి టిఫిన్ కానిచ్చి బసకు చేరుకున్నాము సామాన్లు తీసికొని రూం ఖాళీచేసి బయలు దేరాం ఆటోలు వచ్చాయి సామానులు ఆటోలలో పెట్టేటప్పుడు కాస్త గందరగోళం అయినా సామాన్లు ఏమీ పోలేదు సకాలానికి బస్సు దగ్గరకు చేరాం. అక్కడ రంగారావు గారు వాళ్లు మా కోసం ఎదురుచూస్తున్నారు అందరం అక్కడ సంతోషంగా కలుసుకొన్నాం ఇక ఒకటే సందడి!

# కేదార్, బదరీ బస్

మేం ఢిల్లీలో బస్ ఎక్కేసరికి 11 గంటలయింది, ముందుగా బస్సును ఢిల్లీలోని హనుమాన్ మందిర్ దగ్గరకు తీసికొనిపోయారు కేదార్ యాత్ర కష్టమైంది కదా! అందుకని భగవదనుగ్రహం కోసం బస్సుకు అక్కడ పూజ చేయించారు, అందరం దిగి గుళ్లోకి వెళ్లి దర్శనం చేసుకున్నాం అక్కడ అన్నీ పాలరాతి విగ్రహాలు సీత, రాముడు, లక్ష్మణుడు, హనుమాన్ విగ్రహాలే కాక వినాయకుడు, కుమారస్వామి, శివుడు, పార్వతి అంతా ఉన్నారు ఆలాగే సంతోషిమాత, లక్ష్మినారాయణ విగ్రహాలు కూడా వున్నాయి మా యాత్రలో మొదలు చూసిన గుడి యిదే, ఇక్కడి ఆంజనేయ స్వామి ఒకసైడు ఆంజనేయుడు, అక్కడ ఆయనకు ఒక కన్ను ఒక ప్రక్కనే కనపడుతుంది అట్లాంటి విగ్రహాన్ని చూడటం అదే మొదటిసారి అక్కడ అన్ని తృప్తిగా చూసి బస్ ఎక్కాము బస్సులో సీట్లు ఇరుకుగా వున్నాయి మన బస్సులు చాలానయం. అట్లాగే అంతా నిద్రపోయాం తెల్లారేసరికి ఋషికేష్ చేరాం.

## ఋషీకేశ్ :

బస్సు దిగగానే అందరం తొందర తొందరగా కాలకృత్యాలు తీర్చుకొని గంగాస్నానానికి వెళ్లాం స్నానానికి వెళుతుంటే దారిపొడుగునా గుండ్రాళ్లే! మంచి మంచి గుండ్రాళ్లు ఏరుకుంటూ ముందుకుపోతుంటే, ఇంకా మంచివి కనిపించేవి అలా అన్నీ ఏరుకుంటూ కుప్పపోస్తుంటే ఒకాయన చూసి 'గుండ్రాళ్ళు కాదు, అదృష్టం వుంటే సాలగ్రామాలు దొరుకుతాయి వెదుకుతే' అని చెప్పాడు

అక్కడ రంగారావు గారు అందరికీ కాఫీలు యిప్పించాడు. తరువాత గంగా స్నానానికి ఉపక్రమించాం. నీళ్లు ఫ్రిజ్‌లోంచి తీసి నట్లున్నాయి. అట్లాగే అందరం స్నానాలు చేసి బట్టలారేసుకున్నాం. స్వర్ణ అందరికీ బట్టలు ఆరవేయటంలో, సంచులు మోయటంలో సహాయపడుతున్నది. శారదక్కయ్యకు స్వర్ణతో పరిచయం తక్కువగదా! స్వర్ణ ఎంత మంచిదేమో! మనలనందర్నీ ఎంతగానో కనుక్కుంటోంది - అన్నది. అక్కడ నుండి ఆరిన బట్టలు తీసుకొని ఏరిన గుండ్రాళ్లను తెద్దామని చూస్తే నాకూ, సావిత్రికీ అలవికాలేదు. చివరకు ఏరినవన్నీ అక్కడే వదిలేసి శాంపుల్‌కు ఒకటి పట్టుకొని వచ్చాము. సరసక్కయ్యనూ, సరోజినినీ చాలసార్లు అనుకున్నాము. గుండ్రాళ్లు చూస్తే సరసక్కయ్య ఎంత సంతోషపడేదో గదా - అనుకున్నాము. నెమ్మదిగా సావిత్రి, నేను వెనకబడి చిన్నగా సైగలు చేస్తూ ఎలాగో బస్ దగ్గరకు చేరుకున్నాము. బస్సెక్కి శివానంద ఆశ్రమానికి వెళ్లాము.

నేనీ యాత్ర చేస్తానని కలలో కూడ అనుకోలేదు. పిల్లలు నేనీయాత్ర చేయడానికి వొప్పుకున్నారు. గోపి డబ్బులు తెచ్చిచ్చాడు. రఘు కూడా యిచ్చాడు. పిల్లలు యింత మంచిపని చేసి నాకీ యాత్రలు చేసే అదృష్టం కల్పించి తల్లి ఋణం తీర్చుకున్నారు. నిజానికి నా వంటి పరిస్థితి చూస్తూ 'ఈ స్థితిలో ఏం యాత్రలు చేస్తావే?' - అంటే ఏం చెప్పగలిగివుండేదాన్ని?

## లక్ష్మణ్ ఝూలా :

శివానంద ఆశ్రమంలో కూడ అన్నీ పాలరాతి విగ్రహాలే. రాధాకృష్ణులు, హనుమాన్, శివానంద విగ్రహాలు ఉన్నాయి. ఆహాలు ఎంతో అందంగా, ప్రశాంతంగా ఉంది. ఇవన్నీ చూడగలగటానికి నేనెంత పుణ్యం చేసుకున్నానో? - అనిపించింది. అక్కడ నుండి లక్ష్మణ్‌ఝూలాకు వచ్చాము. అది గంగపైన మధ్య స్తంభాలనేవి లేకుండా ఆ వొడ్డు నుండి యీ వొడ్డుకు గట్టి తీగెలు బిగించి, వంతెన నిర్మించారు. మనుష్యులు నడిచి పోయేందుకే గాని వాహనాలకు పనికిరాదు. మనం వంతెన మీద నడుస్తుంటే, అది ఉయ్యాల వలె వూగుతుంటుంది. కనుక లక్ష్మణ్ ఝూలా అన్నారు. ఝూలా అంటే ఉయ్యాల. కొందరు 'రాం ఝూలా' అని కూడా

.ంటారు దాని మిద నడుస్తుంటే సరదాగానే వుంటుంది కాని న ః మాత్రం కళ్లు తిరుగుతవేమోనని మొదట భయం వేసింది కాని తరువాత బాగానే అనిపించింది

అక్కడ రంగారావు గారు రుద్రాక్షలు కొనుక్కోవాలను కున్నారు అందుకని బస్సువాళ్లు రుద్రాక్ష దుకాణానికి తీసుకొని వెళ్లారు రంగారావుగారు, భారతివెళ్లి నవరత్న ఉంగరాలు, నవరత్న గొలుసులు, రుద్రాక్షలు రు 3,000/- పెట్టి కొనుక్కొని వచ్చారు సావిత్రి, విమల కూడ నవరత్న గొలుసులు కొన్నారు అక్కడ చెప్పులు తెగితే, నేను విమల కొనుక్కున్నాము మందులు గ్లూకోజు వంటివి పెట్టుకొనటానికి వీలుగా వుండే ఒక బేగ్ (Bag) ను నేను కొనుక్కున్నాను. గుర్రం మీద వెళ్లాల్సివస్తే పట్టుకొనటానికి బేగ్ అయితే తేలిక అని

అక్కడ నుండి టాక్సీ మాట్లాడుకొని, తిరిగి లక్ష్మణ్ ఝూలా వద్దకు వచ్చాము. అక్కడే అందరం ఇడ్లీ తిని, కాఫీతాగాము. అక్కడ అనేక అంతస్థులు వున్న ఆలయం వుంది అందులో త్రిమూర్తులు సకుటుంబంగా వున్నారు సప్త ఋషులు, నారదుడు, సనకసనందనాదులతో చక్కగా కొలువుతీర్చి వున్నారు నిజంగా అక్కడ సజీవ వ్యక్తులు సభతీర్చి కూర్చున్నట్లే వుంది ఆ ఆలయంలో 13 అంతస్థులు ఎక్కితే శంకరాచార్యులవారు ఉన్నారని అన్నారు కాని నాకు చాత కాలేదు విమల, స్వర్ణ ఓపికచేసుకొని 15 అంతస్థులు ఎక్కారు.

తరువాత దత్తాత్రేయులు, దుర్గాదేవి, సంకటమోచన హనుమాన్, విఘ్న వినాశక గణేశ్ మొదలయిన ఆలయాలు దర్శించాము అక్కడ వున్న దేవుడు యిక్కడ లేడా? - అంటారు కాని యాత్రలకు వెళ్లినప్పుడు అక్కడి నదుల, దేవాలయాల పవిత్రత, ఆ సమయంలో మనలో కలిగే అనుభూతి, పవిత్రత, ఆనందం అనుభవిస్తేనేగాని తెలియదు

రంగారావుగారు ఈ మధ్యనే గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న మనిషి వెంట వచ్చిన వాళ్లం అందరం ఆడువాళ్లం వయసు మీరిన వాళ్లమేగాక

ఒక్కరమైనా మంచి ఆరోగ్యం వున్న వాళ్లం కాదు  అయినా ఆయన సాహసం చేసి మమ్మల్నందర్నీ తీసుకొని యింత కష్టమైన యాత్ర చెయటానికి ఉత్సాహం చూపారంటే. ఎంతో మెచ్చుకోవలసిన విషయం  ఇంకొకరింకొకరయితే, యిందుకు ససేమిరా వొప్పుకునే వాళ్లా? వెంట తీసుకొని రావటమేగాదు, ఎప్పటికప్పుడు మా అందరికీ ఏంకావాలో  కనుక్కుంటూ, కాఫీలు, ఫలహారాలు ఏర్పాటు చేస్తూ, ప్రయాణ బడలికగాని, ఏ రకమైన యిబ్బంది గాని తెలియకుండా యాత్ర చేయించటం ఎంతో అభినందించ వలసిన **విషయం.**  **మేమంతా ఆయనకు** ఎంతో ఋణపడి వున్నాం  ముఖ్యంగా **నా విషయంలో ఆయన ప్రత్యేకంగా** శ్రద్ధ తీసుకొని నాకు తెలియకుండానే గోపీకి **ఫోన్** చేయించి నా **ప్రయాణం ఖాయం** అయేటట్లు శ్రద్ధ తీసికొన్నారు  లేకపోతే **నా అంతట నేను** [illegible] పిల్లలను యింత పైకం అడిగేదాన్నా?  నాకీ **అమూల్య అవకాశం** ఎక్క వచ్చేదా? ఇలా నన్ను ప్రయాణం చేయించిన పుణ్యం రంగా**రావుగారిది.** **పైకం యిచ్చి** పంపించిన పుణ్యం గోపిది  రంగడికి శారదక్కయ్య టిక్కెట్టు (స్వాతంత్ర్య సమరయోధుల **రైల్వే పాస్‌లో** రెండవవ్యక్తి కింద) యిచ్చింది  సావిత్రి శేషుకు యిచ్చింద, మిగతా వాళ్లం అంతా ఎవరి టిక్కెట్లు వాళ్లమే కొనుక్కొని వచ్చాము  సురేష్, స్వర్ణ అందర్నీ వేయి కండ్లతో కనిపెట్టి చూస్తూ, కనుక్కొంటూ ఎవరికీ ఏ కష్టం కలక్కుండా చూస్తూ వచ్చారు. రంగడు, శేషు పై ఎత్తున తిరుగుతూ, సామాన్లు అవీ జాగ్రత్తగా కనిపెడుతూ మా అందరికీ సహాయంగా వున్నారు  ఇలా అందరి సహకారంతో ఎంతో హాయిగా, ఆనందంగా, సరదాగా మా యాత్ర సాగుతూ వచ్చింది

నేను, రంగడు వెళ్లి గీతాభవన్ చూసి వచ్చేసరికే, రంగారావుగారు వాళ్లు భోజనాలు చేస్తున్నారు  'మీరు భోజనాలుచేసి, యిక్కడే కూర్చోండి! మేం వస్తాం, అని చెప్పి వెళ్లారు  కాని వాళ్లు గీతాభవన్ చూడలేదు. వాళ్లు సరాసరి బస్సు దగ్గరకు వెళ్లారు  మేం వాళ్లకోసం కాసేపు వేచివుండి, చివరకు వాళ్లను  ...క్కుంటూ బయలుదేరి పడవ ఎక్కి బస్సు దగ్గరకు చేరాం  అప్పటికి అంతా బస్సు దగ్గరకు వచ్చి మాకోసం ఎదురు చూస్తున్నారు  మేం రాగానే బస్సు బయలుదేరింది

## శ్రీనగర్ :

ఋషికేశ్ నుంచి హిమాలయాలు ప్రారంభం అక్కడ నుండి ఘాట్ రోడ్డుపై ప్రయాణం మొదలు. కొంతదూరం వెళ్లిన తరువాత చల్లటి మంచినీరు దొరుకుతుందని చెప్పి ఒకచోట బస్సు ఆపారు అంతావెళ్లి మంచి నీళ్లు వాటర్ బాటిల్స్‌తో తెచ్చుకున్నాము ఎండ తీక్షణంగానే వున్నా, గాలి చల్లగా వీస్తోంది కనుక హాయిగానే వుంది ఒకవైపు అగాధమైన లోయ యింకొకవైపు ఆకాశన్నంటే పర్వతాలు మా బస్సులో బందరు వాళ్లు కొందరు, తెలుగువాళ్లు యింకా కొందరు ఎక్కారు అందువల్ల అందరం సరదాగా మాట్లాడుకుంటూ కూర్చున్నాం ఒకామె 'తిరిగి, తిరిగి కాళ్లు నొప్పులు పుడుతన్నాయి' అంటుంటే, ఆమెభర్త మా వైపు చూపించి 'మామ్మగారలు చూడు! ఎంత ఉషారుగా తిరుగుతున్నారో?' అంటూ భార్యను మందలిస్తున్నాడు

గైడు మాకు హిమాలయాలను చూపిస్తూ హిమాలయాలలో చిన్నవి, పెద్దవీ కలిపి మొత్తం లక్షా 15 వందల పర్వతాలున్నాయన్నాడు కాళిదాసు హిమాలయాలను రూళ్లకఱ్ఱ (మానదండం) అని వర్ణించాడు. హిమాలయాలను దేశానికి పెట్టనికోట అంటారు.

కొంతదూరం వెళ్లిన తర్వాత బస్సు ఆపారు గైడు ఇక్కడనే భాగీరథి (గంగ), అలకనంద నదుల సంగమం వుంది. వెళ్లి చూసిరండి! అన్నాడు అంతా దిగి వెళ్లి నెత్తిన నీళ్లు చల్లుకొని వచ్చారు. నేను, సావిత్రి కొంత దూరం వెళ్లి నడువలేక వెనక్కు వచ్చి బస్సులోనే కూచున్నాము రంగడు నీళ్లు ఒక సీసాలో తెస్తే నెత్తిన చల్లుకున్నాము అది దేవప్రయాగ అంతా నెత్తిన నీళ్లు చల్లుకొని రాగానే బస్సు బయలుదేరింది

బస్సులో నుండే సూర్యాస్తమయ దృశ్యం చూశాం. ఎంతో మనోహరంగా వుంది మనకు దగ్గర్లో వున్నట్లే వుంటుంది. ఘాట్‌రోడ్ ప్రయాణం ప్రమాదకరంగానే కనిపిస్తుంది. బస్ వెళ్లినంతసేపు, ప్రయాణీకులంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని భయపడుతూ కూర్చున్నారు. ఎట్లాగో భగవంతుని దయవల్ల శ్రీనగర్ క్షేమంగా చేరుకున్నాము

కాశ్మీరు రాజధాని శ్రీనగర్. ఈ శ్రీనగర్ వొకటి కాదు ఇది వేరు అక్కడ ఒక సత్రంలో అందర్నీ బస చేయించారు మా పదకొండు మందికీ విడిగా రెండు గదులు తీసుకున్నారు, ఒక గదిలో మొగవాళ్లూ, యింకో గదిలో ఆడవాళ్ళు, దిగాం మిగతా ప్రయాణీకులంతా వేరే వున్నారు మా గదులకు రు 500 అద్దె! గదికి రెండు మంచాలున్నాయి అంతా మొహాలు కడుక్కొని కూర్చున్నాం స్వర్ణ అందరికీ మర్నాటికి క్కావలసిన బట్టలు అవీతీసి మడతలుపెట్టి వేరే సర్ది వుంచింది రాత్రంతా **బస్‌లో** నిద్రసరిగా లేకపోయింది. తెల్లవారు ఝామున నాలుగ్గంటలకల్లా మళ్ళీ **బయలుదేరాలి** అంతా డోలీలు, గుర్రాలు ఎక్కటం ఎట్లా? - అంటూ దానిని గురించే మాట్లాడుకుంటూ కూర్చున్నాము గుర్రానికి రు.500/- ట! డోలి అయితే రు 1500/- ట! శారదక్కయ్య, సావిత్ర గుర్రం ఎక్కటానికి భయపడుతున్నారు రంగరావుగారు నవ్వుతూ 'మీరు గుర్రాలెక్కి ఏమయినా అయితే మీ కొడుకులకు నేనేం సమాధానం చెబుతాను? అందుకని డబ్బుపోతే పోయింది. డోలీలే ఎక్కిస్తా' నన్నారు అంతా కేదార్ యాత్ర గురించి భయపడే వాళ్లే అంతా భగవంతుని దయ అనుకోడమేగాని, నిజంగా మన చేతిలో ఏమీ లేదు మన వల్ల ఏమౌతుంది?

అంతా వెళ్ళి ఫలహారం (దోసె) చేసి. మజ్జిగ తాగాము. హాయిగా నిద్ర పోయాము ఈ విధంగా నాల్గవరోజు ప్రయాణం ముగిసింది

## రుద్రప్రయాగ :

అంతా తెల్లవారు ఝామున 3 గం॥కే లేచి స్నానాలు కానిచ్చాము బస్సెక్కి మళ్ళీ ప్రయాణం ఆరంభించాము రుద్రప్రయాగ చేరుకున్నాము అక్కడ మందాకినీ, అలకనంద నదులు కలుస్తాయి. ఆ సంగమంలో స్నానం చేస్తే మంచిదని గైడు అన్నాడు కాని అక్కడ నీళ్లు ఇఘాలు, అంత చల్లటి నీళ్లలో స్నానం చేస్తే జలుబు పట్టుకుంటే కష్టం అందుకని ఊరికే నీళ్లు నెత్తిన చల్లుకున్నాము ఇది ముందుగా అనుకొనే శ్రీనగర్‌లోనే రూంలో వేడినీళ్లు స్నానం చేసి వచ్చాము బస్సులో కొంతమంది స్నానం చేసి వచ్చారు బస్సు ఆగిన చోటు నుండి నదిలోకి దిగటం కూడా చాలా కష్టం ఇరుకుదారి, కాలు జారిందంటే వెళ్ళి సరాసరి నదిలో

పడటమే ఎట్లాగో అంతా కలిసి దిగాము 50, 60 మెట్లు ఎక్కితే అక్కడ గంగా భవాని, శివాలయాలున్నాయి. మళ్లీ అటునుండే బస్సు దగ్గరకు పోవచ్చు

## మళ్లీ శ్రీనగర్ :

అక్కడ నుండి బయలుదేరి సాయంకాలానికి తిరిగి శ్రీనగర్ చేరాము అక్కడ ఒక హోటలులో గదికి రు 250/- పెట్టి రెండు గదులు తీసుకున్నాము వెళ్లగానే కాఫీలుతాగి, స్నానాలుచేసి, టిఫిన్ తిని పడుకున్నాము స్వర్ణ మేం స్నానాలు చేయగానే అందరి బట్టలు సర్దిపెట్టింది కేదారుకు వెళ్లే సామాన్లు, బట్టలు వేరే తీసి పెట్టింది. అన్ని ఏర్పాట్లు చూసుకొని గాని పడుకోలేదు

మళ్లీ తెల్లవారుఝామున మా అందరికన్నా ముందు స్వర్ణేలేచి మమ్మల్ని అందర్నీ లేపింది అందరికీ వేడి నీళ్లు తెప్పించింది. అంతా స్నానాలు చేసి రడీ అయాము. బస్సెక్కి కేదారుకు బయలుదేరాము

## గౌరీకుండు :

ఉదయం 8 గంటలకల్లా గౌరీకుండు చేరాము అక్కడి వరకే బస్ ఆ తరువాత కాలినడకన గానీ, గుఱ్ఱాలపై గానీ, డోలీపైగాని ప్రయాణం చేయాలి అంతా ముందు అక్కడ పూరీలు తిని కాఫీలు తాగాము ఒక్కొక్కళ్లకు రు 1100 చొప్పున 5 డోలీలు, రు. 400 చొప్పున 6 గుఱ్ఱాలు మాట్లాడారు ఉదయం 11 గం కు మేము అయిదుగురు అక్కచెల్లెళ్లం అయిదు డోలీలు ఎక్కాం మిగిలిన వాళ్లు గుఱ్ఱాలు ఎక్కారు డోలీలు ఉయ్యాలల మాదిరిగా వుంటాయి. ముందర యిద్దరు మనుష్యులూ, వెనక యిద్దరు మనుష్యులూ పట్టుకొని మోస్తారు

## అంతం కాదిది ఆరంభం :

బయలుదేరినప్పుడు పెద్ద చలి వుంటుందని అనుకోలేదు. అందుకని అందరం చిన్న స్వెట్టర్లు వేసుకొని శాలువలు కప్పుకొని బయలుదేరాము రెయిన్ కోట్లు అద్దెకు తెచ్చారు. తప్పకుండా వర్షం వస్తుందని బస్సువాడు చెప్పాడు. అయితే మేము ఒక కిలో మీటరు వెళ్ళామో లేదో, ఒకటే వర్షం! మేము తడవలేదుగాని ఒకటే ఈదురుగాలి చలి బాగా ఎక్కువయింది దారిలో అక్కడక్కడా చిన్న చిన్న పందిర్ల

వంటివి ప్లాస్టిక్ షీట్లతో వేసి వున్నాయి అక్కడ టీ, రొట్టెలు, స్వీట్లు దొరుకుతాయి అలాటి పందిర్లు దారిలో చాలావుంటాయి ఆ అడవిలో వాళ్లు తోడు లేకుండా ఎలా వుండగలుగుతున్నారో? ఒక వైపు చూస్తే భయంకరంగా లోయ అందులో మందాకినీ ప్రవాహం హోరున మోతపెట్టుకుంటూ పోతుంటుంది రెండో ప్రక్కన ఆకాశాన్ని అంటే హిమాలయాలు, దారి చాలా యిరుకు వందల కొద్దీ గుర్రాలు, డోలీలు, వచ్చేవి పోయేవి - కాలినడకన వేల జనం! ఇందులో వాన, బురద, పెద్ద పెద్ద రాళ్లు ఏ మాత్రం కాలుజారినా పాతాళంలో పడటమేగాని ఆశలేదు ఇక గుర్రాలు దారి అంచున కొసనుండి పోతుంటాయి వాళ్లకు బాగా అలవాటు కావచ్చు కాని యాత్రీకులకు కొత్త గదా! గుండెలు పీచు పీచు మంటుంటాయి భారతి, నేను, ప్రేమ - ఎక్కిన డోలీలు దగ్గర దగ్గరగా కలిసే పోతున్నాయి శారదక్కయ్య, సావిత్రి ఎక్కిన డోలీలు మధ్యలో ఆపిన చోట కలుస్తూ వున్నాయి కొంచెం దూరం పోయిన తర్వాత డోలీ ఆపి భారతిని దిగమన్నారు భారతి అమ్మో! నేను దిగలేను చలి!' - అని వణికిపోతున్నది నాకు కూడా చలికి చేతులు, కాళ్ళు కొంకర్లు పోయాయి. నేను కూడా లేవలేకపోయాను వాళ్లు భారతిని లేపి నిలుచోపెట్టారు కాని వాళ్ళు వదలగానే భానతి నిలుచోలేక చతికిలబడ్డది అది చూసి నేను భయపడి ఎలాగో లేచి దాని దగ్గరకు పరుగెత్తి దానిని లేపబోతే, లేవలేకపోయింది వాళ్లకేమో మన భాష తెలియదు అయినా వాళ్లు పరిస్థితి గ్రహించి, భారతిని ఎత్తుకొని వెళ్లి అక్కడ పొయ్యి దగ్గర కూచోబెట్టి, చేతులు, కాళ్లు కాపుతూ కూర్చున్నారు ప్రేమకు, నాకు భయం వేసింది ఇది అంతం కాదు, ఆరంభమే! ఇంకా ఎంతో దూరం పోవాలి ఇప్పుడే చలి యిలా ఉంది ముందు ముందు ఇంకెలా ఉంటుందో! పైగా ఇక్కడ అంతా ఎవరికి వారే! అందర్నీ కలుపుకొని పోవటం వుండదు మిగితావాళ్ళ పరిస్థితి మనకూ, మన పరిస్థితి మిగిలిన వాళ్ళకూ తెలియదు ఇంతట్లో సురేష్ గుర్రం మీద వస్తూ కనిపించాడు మేం కేకలు పెడితే చూసి దగ్గరకు వచ్చాడు చిన్నగా వేడి వేడి కాఫీ పట్టాము వాన కొంచెం తగ్గగానే, బయలుదేరాము

కొంచెం దూరం వెళ్లిన తరువాత మళ్లీ ఆపారు కాని భారతి కీళ్లవాతం మూలాన కదలలేకపోయింది మాకు గూడ భయంగానే ఉంది అక్కడ చలి కాపుతుంటే, ఈసారి శేషు కనిపించాడు వాడు కాస్త ధైర్యం చెప్పి వెళ్లాడు డోలీల వాళ్లు వాన బాగా వుంటే ఆగటం, తగ్గిన తరువాత వెళుతుండటం చేస్తున్నారు ఆపినప్పుడలా భారతి చలికి తట్టుకోలేక బాధపడుతుంటే మాకెంతో భయం వేసేది

మా పరిస్థితీ అంతంత మాత్రంగానే వుంది కాని భారతి పరిస్థితి మరీ కంగారు పెట్టేట్లుగా వుంది. ఎవరకు భయపడి ఏడుస్తూ కూర్చుంది మాకేం చేయడానికి పాలుపోలేదు అయితే భగవంతుడు మా వెంటనే ఉండి కనిపెట్టి కాపాడుతున్నాడా అనిపించింది ఈసారి రంగారావుగారు కనిపించారు మేమాయనను చూసి పిలిచాము ఆయనగారు వచ్చి భారతికి నిప్పులు కాపించి, వేడి కాఫీ తాగించారు అప్పుడే అక్కడకు శారదక్కయ్య, సావిత్రి వస్తున్న డోలీలు కూడా వచ్చి ఆగాయి వాళ్లకు కూడా రంగారావుగారు కాఫీ పంపించారు భారతికి ధైర్యం చెప్పి ఆయన బయలు దేరి వెళ్లారు అప్పటి వరకు మేమంతా బాగానే వున్నాం

ఆ పర్వతశ్రేణులను, పర్వతాలపైగల రకరకాల చెట్లూ, పూలు చూస్తూ, రమణీయ ప్రకృతి దృశ్యాలను కనులపండువగా చూస్తూ పోతున్నాము ఎక్కడి కక్కడ మా పిల్లలు, ఇలాటి యాత్ర మీరు చేయలేరు' అని అడ్డు చెప్పకుండా సహకరించి పంపించినందుకు సంతోషిస్తూ సంబరంగానే వెళుతూ వున్నాం వాన వచ్చినప్పుడు కొండవార వాన ఉధృతం తగలకుండా ఆపుతూ, వాన తగ్గగానే బయలుదేరుతూ యిలా ప్రయాణం సాగిస్తున్నారు, డోలీలవాళ్లు నడిచేవాళ్లూ, గుర్రాల మీద వచ్చే వాళ్లు అందరూ అలాగే చేస్తుంటారు కాని ఆ వాన గాలికి పర్వతాల పై నుంచి రాళ్లు దొర్లి పై ... పడతాయేమోనన్న భయం వుంటుంది.

అవన్నీ చూస్తుంటే జగతిపై బడవచ్చు **జలరాశి** కెరటాలు మామూలు మేరకు ముడవలేక ... ఎంత శ్రమనందుచుంటివో **ఏ**... స్వామి!' - అన్న కరుణశ్రీ (జంధ్యాల పాపయ్యశాస్త్రి) గారి **పద్యం గుర్తుకు వచ్చింది. భగ**వంతుని అనుగ్రహం వల్లనే మాకు అలాటి **అవాంతరాలేమీ** కలుగలేదు చూస్తుంటే నిజంగానే ఆ రాళ్లను ఎవరో పట్టి ఆపుతున్నట్లే వుంది. అటువంటి పరిస్థితిలో కూడ మాకు మన వాళ్లంతా కూడా యిటువంటి యాత్ర చేస్తే బాగుంటుంది అనిపించింది వాళ్లకందరికీ తప్పక వెళ్లి చూసి రండి అని చెప్పాలనుకున్నాము

ఇంకా నాలుగు కిలోమీటర్లు వెళ్లాలని అన్నారు అప్పుడు వర్షం ఆగలేదు చలి దుర్భరంగా ఉంది మేమంతా దుప్పట్లు కప్పుకొని కూచున్నాం భారతి మాత్రం చాల అవస్థ పడుతున్నది ఒక కిలోమీటరు ఉందనగా మళ్లీ ఒకసారి ఆపారు వా...

కొండ దాదాపు నిటారుగా ఎక్కాల్సి వస్తోంది బాట బొత్తిగా బాగలేదు ఎట్లాగో వాళ్లకు సైగలు చేసి తొందర తొందరగా భారతిని ముందు చేర్చండి అని వాళ్లకు చెప్పాము వాళ్లు బాగా అనుభవం వున్న వాళ్లు కదా! అర్థంచేసికొన్నారు వెంటనే డోలీ ఎత్తుకొని తొందర తొందరగా వెళ్లారు మొత్తం మీద క్షేమంగా కేదార్ చేరాం

## కేదార్ :

గైడు వాళ్లకు మమ్మల్ని పోస్టాఫీస్ వున్న యింట్లో దింపమని చెప్పాడు కాని వాళ్లు మమ్మల్ని ముందు బజారున్నదాంట్లో దింపారు దానిలో 3 మంచాలున్నాయి మమ్మల్ని అక్కడ దింపి, భారతిని మాత్రం ఎత్తుకొని తీసుకొనిపోయి అక్కడొక మంచంపై పడుకోబెట్టి పరుపులు కప్పారు మేం దారిలో అంతా బాగానే వున్నాం కాని డోలీ దిగేసరికి చలికి తట్టుకోలేకపోయాము మా సామాను ఏమైందో తెలియదు. తరువాత పరుపుపైన కప్పుకొని పడుకున్నాము. భారతి ఏడుస్తూనే ఉంది 'ఏడవకే!' అని చెబుతామనుకున్నా చలికి మూరు నోరు పెగలటల్లేదు నోట్లో మాట బయటికి రావటల్లేదు. భగవంతునిదే భారం అనుకున్నాం ద్రౌపది రెండు చేతులూ ఎత్తి 'నీదే భారం! అని ఆయనకు దణ్ణం పెట్టినట్లు మేం దణ్ణం పెట్టుకుంటూ పడుకున్నాం

అప్పుడు గజేంద్ర మోక్షంలోని పద్యం గుర్తుకు వచ్చింది. పైకి చదవటం చేతకాలేదు. కనుక మనసులోనే చదువుకున్నాను

లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్
రావుల్ దప్పెను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవేతప్ప ఇత పరంబెరుగ మన్నించదగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

ఇప్పుడు అందరికీ ఆయన తప్ప దిక్కులేదు మాయదారి మల్లిగాడు చెప్పినట్లు మనం ఆయన మీదనే భారం వేసి వచ్చాం కాబట్టి చచ్చినట్లు వస్తాడురా. దేవుడు, అనే మొండి ధైర్యం తెచ్చుకున్నాము. నిజంగా అలా తలుచుకున్నట్లే

భగవంతుడు రానే వచ్చాడు - స్వర్ణ, సురేష్‌ల రూపంలో విమల గుర్రం మీద వచ్చింది సురేష్, రంగడు శేషు, రంగారావుగారు కూడా గుర్రాలపైనే వచ్చారు అంతా బాగా తడిసివచ్చారు చలికి తాళలేక వణికిపోతున్నారు మేం ముందే వచ్చిన సంగతి వాళ్లకు తెలియదు మరి మమ్మల్ని దింపవలసిన చోట కాక, వేరేచోట దింపారు గదా డోలీవాళ్లు పొరపాటున మేం ఏమయ్యామోనని వాళ్లు కంగారుపడుతున్నారు. పొద్దుగుంకింది చేతులెలా కొంకర్లు పోయాయంటే, పొయ్యిలో చేయి పెట్టినా స్పర్శ తెలిసేట్లు లేదుట! ఎవరికి వాళ్లకు పరిస్థితి ఘోరంగా వుంది కాని విమల పరిస్థితి ఇంకా భయంకరం అందుకని వాళ్లంతా తమ తమ చలినీ, బాధలనూ లక్ష్య పెట్టకుండా విమలను తీసికొనిపోయి నిప్పులుకాపి, పడుకోబెట్టి పరుపులు కప్పి మాకోసం వెదకటం ప్రారంభించారు వానలో తడిసి రావటంవల్ల వాళ్లందరికీ చలి కడుపులో నుంచి తన్నుకొని వస్తోంది వాళ్లకు కూడా తలా రెండు పరుపులు కప్పి, స్వర్ణ మాకోసం వస్తూ వుంది. మాకు డోలీలు దిగకముందే కలిసింది కాని వస్తున్నాం పద!' అన్నాం అప్పుడు, అది వెనక్కు తిరిగింది. ఇంతలో డోలీలవాళ్లు మమ్మల్ని దింపవలసిన బసలోగాక వేరే చోటికి తీసుకొనిపోవటంతో ఒకళ్ళకొకళ్లకు లింకు కుదరక కంగారయింది మేం గదిలో 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ అనుకుంటుండగా సురేష్ వెతుక్కుంటూ వచ్చి, 'ఈ గది మనదికాదు, దగ్గర్లోనే మన కిచ్చిన గది వుంది, పదండి!' అన్నాడు రంగడు వచ్చి 'అమ్మా! పిన్నీ! భయం లేదు రిలాక్సకండి!' అని ధైర్యం చెప్పాడు అందరం కలిసి, మా గదికి చేరాం. డోలీల వాళ్లు 'డోలీ ఎక్కండి - తీసుకొనిపోతాం' - అన్నారుగాని మాకు డోలీ ఎక్కే శక్తికూడా లేదు అందుకని డోలీలవాళ్లే మమ్మల్ని చేతులుపట్టుకుని నడిపిస్తూ ఎలాగో గదికి చేర్చారు. పరుపులపై పడుకోబెట్టి రెండేసి పరుపులు పైన కప్పారు రంగడు వేణ్ణీళ్లలో గ్లూకోజు వేసి తెచ్చి నాకిచ్చాడు. తాగి పడుకున్నాను నాకు చలి తప్ప వేరే ఆయాసం వంటి బాధలు లేవు విమలకైతే మాటరాక పడుకున్నది ఆ చలిని లెక్క చేయకుండా స్వర్ణ, సురేష్ డాక్టరు దగ్గరికిపోయి మా అందరికీ మందులు తెచ్చిచ్చారు అవి వేసుకోవాలంటే ముందేదైనా ఆహారం తీసుకోవాలి అందుకని మళ్లీ ఒకొక్కళ్లను లేపి అటుకులు, బ్రెడ్ తినిపించటానికి అరగుంట పట్టింది. అంతసేపు స్వర్ణవాళ్లు చలిలోనే అవస్థపడుతూ మా అందరికీ ఆహారం. మందులూ యిచ్చి పడుకోబెట్టారు నేను మాత్రం మాత్రలు వేసుకోలేదు

ఆ రాత్రి అంతా వాళ్లకు తగని భయం వేసింది. వాళ్లేమో చిన్నవాళ్లు. పెద్ద వాళ్లందరి పరిస్థితి ఇలా వుందాయె చలి తగ్గేట్లు లేదు మనుషులు తెప్పరిల్లుకోట ల్లేదు రంగారావుగారు కంగారుపడకుండా మా అందరి పరిస్థితి జాగ్రత్తగా కనిపెడుతూ వున్నాడు ఆ రాత్రి అంతా ఎలాగో నిద్రలోకి జారి హాయిగానే నిద్రపోయాం.

స్వర్ణ, సురేష్, శేషు, రంగడు మాత్రం చీకటితోనే లేచారు మమ్మల్ని లేపి మొహాలు కడిగించి. వేడి కాఫీలు యిచ్చారు తలకు ఒక మంకీ టోపీ. చేతులకూ. కాళ్లకూ వులెన్ సాక్స్ అందరికీ తెచ్చి తొడిగించి, మమ్మల్నందర్నీ స్వర్ణ తయారు చేసింది మేం ఎవరం స్నానాలు చేయలేదు మేమే కాదు, మా బస్సులో వచ్చిన వాళ్లలో ఎవరూ స్నానాలు చేయలేదు మొహాలూ, చేతులూ కాళ్లూ కడుక్కోటానికే కాదు, తాగటానిక్కూడా వేణ్ణీళ్లే !

అంత చలిలోనూ పట్టుదలగా రంగారావుగారు మాత్రం స్నానం చేశారు పూజ చేయించుకున్నారు. అంతా నెమ్మదిగా గుడికి చేరాం అక్కడ దర్శనానికి పెద్ద క్యూ. పై నుండి చెక్కలు చెక్కలుగా మంచుగడ్డలు వూడి పడుతున్నాయి. కాళ్ల విపరీతమైన మంటలు. చలి సూదులతో పొడిచినట్లు పొడుస్తోంది. ఆ క్యూలో ఢిల్లీ నుంచి వచ్చిన వాళ్ల నలుగురు కలిశారు అందులో ఒకామె బిడ్డనే రాజ్యం వదినె (పర్చా శ్రీనివాసరావు, (ఖమ్మం) గారి కూతురు. విజయవాడలో వుండే తెన్నేటి భాస్కరరావుగారి భార్య) కొడుక్కు యిచ్చారట! అంటే, ఆమె మా మేనత్త బిడ్డకు వియ్యపురాలే. ఆమె గుండె జబ్బు మనిషి కనుక కొడుకు, కోడలు ఆమె కేదార్ చూపించమన్నదని తీసుకొని వచ్చారు. 'హార్టు పేషెంటువి, నీకింకా కేదారేమిటి?' అని కోపపడకుండా అంత వోపికగా, ధైర్యంగా ఆవిడను యిటువంటి యాత్రకు వెంటబెట్టుకొని వచ్చిన ఆమె కొడుకునీ, కోడలునూ అభినందించాను - మనసులోనే

రాత్రి రాగానే గదిలో కరెంటు లేదు. కుంపటి పెట్టారు కుంపటి గదిలో వుంటే గదిలో మనకు ఆక్సిజన్ సరిపోదు ఆ గది అద్దె రాత్రికి రు 100 పక్క వేసుకోడానికీ. పైన కప్పుకోవడానికీ పరుపుకు ఒక్కొక్కదానికి రు 15 ఛార్జీ ఒక్కొక్కళ్లం మూడేసి పరుపులు కప్పుకున్నాం అంత కష్టపడి అక్కడ చేరుకొని దైవదర్శనం చేసికోకుండా వెళ్లటం ఎందుకని, ఎలాగో ఓపిక తెచ్చుకొని గుడికి

వచ్చాం. గుడినిండా జనం ఒకటే నెడుతున్నారు. అప్పుడు ఎవరో ఒకాయన మమ్మల్ని పిలిచి తలకాయ పట్టుకుని దేవునికి అంటించాడు మేమయితే ఆ జనంలో నెట్టుకుంటూ ఆ మూలవిరాట్టుదాకా చేరుకోగలిగే వాళ్ళం కాదేమో! భగవంతుడే ఆయన రూపంలో వచ్చి మమ్మల్ని అలా అనుగ్రహించాడు అనుకోవాల్సి వుంది మొత్తం మీద ఎన్నాళ్ల నుండో వున్న కేదార్ యాత్ర కోరిక సఫలమైంది రంగారావుగారి ప్రోద్బలం, స్వర్ణ, సురేష్ సహకారం, మా పిల్లల సహాయం వల్ల కేదారు గుడిని దర్శించగలిగాము శ్రమ అయినా దైవ దర్శనం మాత్రం చివరకు బాగా జరిగింది స్వర్ణ మమ్మల్ని మా హేండ్‌బ్యాగులు కూడా పట్టుకోనివ్వకుండా తానే మోసింది రంగడు, శేషు చేతులు పట్టుకొని నడిపించారు

పాండవులు యుద్ధంలో అందర్నీ సంహరించారు. దానివల్ల కలిగిన పాపాన్ని పోగొట్టుకొనడం కోసం యజ్ఞం చేయాల్సి వచ్చిందట. నా వెంట వస్తే స్వర్గానికి దారి చూపిస్తానని శివుడు చెప్పాడుట వాళ్లను గుప్తకాశి వరకు తీసుకొని వచ్చాడు శివుడు ఆ తరువాత మాయమయినాడు అప్పుడు అర్జునుడు శివుని వెతుక్కుంటూ గౌరీకుండు వరకూ వెళ్లాడట అక్కడ శివుడు ఎద్దురూపంలో వున్నాడు అప్పుడు అర్జునుడు రెండు పర్వతాలపైన రెండు కాళ్లు పెట్టి నిలుచున్నాడట ఆయన రెండు కాళ్ల మధ్య నుండే అంతా వెళుతున్నారట గాని శివుడు మాత్రం పోలేదు కనుక ఆ ఎద్దే శివుడని గ్రహించి, అర్జునుడా ఎద్దు తోకను కేదారులో తొక్కిపెట్టాడట! తోక కేదారులో వుంటే మొహం మాత్రం నేపాలులోని పశుపతి నాధాలయంలో వెలిసిందిట! ఇది అక్కడి స్థల పురాణం అని చెప్పారు కనుకనే కేదార్‌లో దేవుడు ఎద్దుతోక కుచ్చు ఆకారంరలో వుంటాడు కాని లింగాకారంలో లేడు

అమ్మవారి దర్శనం కూడా చేసుకొని అంతా బయలుదేరి వచ్చాము రంగారావుగారు, భారతి అక్కడ అర్చన చేయించుకొని వచ్చారు. ఆ సంగతి శారదక్కయ్యకు తెలియదు మాతోపాటు బయటకు వచ్చేసింది. గుడిని గురించి తెలుసుకుందామంటే వాళ్ల భాష మనకూ, మన భాష వాళ్లకూ తెలియదు. స్వర్ణ వాళ్లతో మాట్లాడి, కనుక్కొని మాతో చెబుతుండేది.

ఇంతలో డోలీలవాళ్లు వచ్చారు. మేం కూడా రూంకు వచ్చి కాఫీలు తీసుకొని సామాను సర్దుకొని బయలుదేరాము అక్కడ కాఫీ రు. **10.** టీ రు. 7. స్వర్ణ వచ్చి అందరికీ చేతులకూ, కాళ్లకూ వులెన్ సాక్స్ తొడిగి, మంకీ టోపీలు పెట్టింది. డోలీలలో కూర్చోబెట్టి దుప్పట్లు కప్పి, పైన రెయిన్‌కోటు వేసి వెళ్ళింది. ఈసారి 5 గురి డోలీలు కలిసే వచ్చాయి కాని మధ్యలో శారదక్కయ్యవాళ్లు విడిపోయారు. వచ్చేటప్పుడు వానలేదు ఎండకాస్తూ ఉంది. చలి బాధ సొంతం తగ్గలేదు కాని చాలా నయం. బాగానే మాట్లాడుకోగలుగుతున్నాం కిందికి దిగుతున్న కొద్దీ చలి తగ్గుతుంటుంది మధ్య సురేష్‌వాళ్లు కూడా కలుస్తూ వచ్చారు. కొండలు పచ్చని చెట్లతో అందంగా వున్నాయి. వాటిపైన చెట్లను ఎవరో నీళ్లుపోసి పెంచుతున్నట్లుంది.

అప్పుడు నాకు పోతన భాగవతంలోని పద్యం ఒకటి గుర్తుకివచ్చింది

'అడవిలోన నున్న అబలుండు వర్ధిల్లు

రక్షితుండు మందిరమున జచ్చు.

మనం ఎంతో శ్రద్ధగా ఏదైనా మొక్కను తెచ్చి నాటి పెంచుతాం అది బతకదు ఈ చెట్లన్నిటినీ ఎవరు పెంచుతున్నారు? దారి వెంటనే ఒక ప్రక్క గంగా మాత హోరున శబ్దంచేసికొంటూ మాతోనే వస్తున్నట్లుంటుంది గంగావతరణ ఘట్టంలో పోతనగారు దివినుండి భువికి గంగ దిగిన ఘట్టాన్ని ఎంతో చక్కగా వర్ణించిన సంగతి జ్ఞప్తికి వచ్చింది. మా ప్రయాణమంతా ఋషీకేశ్ నుండి గంగ వొడ్డునే జరుగుతోంది. ఇంటికి పోయిన తరువాత భాగవతంలో గంగావతరణ ఘట్టాన్ని మళ్లీ ఎప్పుడు చదువుకుందామా అనిపించింది. పోతనగారు ఇవన్నీ తిరిగి చూసి వచ్చి, కన్నులకు కట్టినట్లు వర్ణించాడా? - అనిపించింది. జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు కూడా 'గొల్లపిల్లల చేతి మాగాయ పచ్చడి పసందు ఎట్లు కనుగొంటివయ్య! ఎవరు చెప్పిరయ్య!'- అని నాలాగే ఆశ్చర్యపడి పద్యరూపంలో ప్రశ్నించారు. నాకు మాత్రం లోయలో పారుతున్న గంగామాత వంక చూస్తుంటే నగర చక్రవర్తుల కథ, భగీరథ ప్రయత్నం గుర్తుకువచ్చాయి. పట్టిన పట్టు విడవకుండా తన తాత తండ్రులకు ముక్తికోసం గంగను భూమికి తెచ్చి మనందరికీ కూడ ఉపకారం

చేశాడు ఆ మహాశయుడు! మహానుభావులకు తలుచుకుంటె అసాధ్యం వుంటుందా? అవన్నీ తలుచుకుంటూ ఆ అద్భుత ప్రకృతి సోయగాలను పరికిస్తూ ఎందో ఆనందంతో వచ్చాము

మేం డోలీలలో హాయిగానే కూర్చున్నాం కాని డోలీల వాండ్ల పరిస్థితి చూస్తే ఎందో బాధ కలిగేది రాళ్లలో బురదలో, నిటారుగా వున్న కొండదారిలో మమ్మల్ని మోస్తూ వాళ్లు ప్రయాణం చేస్తున్నారే! చలికి వణుకుతూ డోలీలో కూర్చుని పోవటమే మనకు ఇంత బాధగావుంటే. వర్షంలో తడుస్తూ చలికి వణుకుతూ పైపెచ్చు మమ్మల్ని డోలీతో సహా మోస్తూ వెళ్లటం వాళ్లకెంత కష్టంగా వుంటుందో కదా! అంతేకాదు వాళ్లకు మన భాషరాకపోయినా, యిబ్బందిగాని, పేచీగాని పెట్టకుండా ఎంతో జాగ్రత్తగా తీసికొని వచ్చారు ఒక్కొక్కసారి వాళ్ల కష్టం చూస్తుంటే నాకు కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అలాగే లోగడ మేం కాశీ వెళ్లినప్పుడు అక్కడ పడవవాళ్లను యిప్పటికీ మరువలేకపోతున్నాను. అన్నిటికన్నా విశేషం ఏమిటంటే, డోలీల వాళ్లు దారిలో ఏ చికాకూ పెట్టకపోవటం, మనం ఒక్కోసారి రిక్షా తీసుకున్నా! ఆటో ఎక్కినా యిక్కడ ఎన్ని పేచీలు, కిరికిరి చేస్తారూ! ముఖ్యంగా మా సామాన్లేవీ పోలేదు. అక్కడ దొంగతనం లేదనిపించింది పైగా సాయంచేసే గుణం వుంది.

దారిలో మనవాళ్లేగాక మా బస్సులో వచ్చిన వాళ్లు కూడా మధ్య మధ్య కలుస్తూ కబుర్లు చెబుతూ వస్తున్నారు మంచి వాళ్లు డోలీలో వుండగా ఫొటో తీయాలనుకున్నారు కాని ఆ చలికి కెమెరా ఎందులో పెట్టిందీ తెలియదు ఎలాగైతేనేం, చివరకు అందరం క్షేమంగా గౌరీకుండు చేరి మళ్లీ మా హోటలుకు వచ్చాము.

గౌరీకుండులో వేడినీటి కుండం వుంది అంతా వెళ్లి అక్కడ స్నానాలు చేసి వస్తుంటారు గాని మాకు చేతగాక మేం వెళ్లలేదు అంతా అన్నాలు తిన్నాం బస్సెక్కి బదరీకి ప్రయాణం అయాము

## బదరీ :

తిరిగి వస్తూ శ్రీనగర్ చేరాము అయిదు గంటలు కావచ్చింది కేదారు

వెళ్లేటప్పుడు కొండల నిండ చెట్లు పెరిగి పచ్చగా కళ కళలాడుతూ వుంటే, శ్రీనగర్ పరిసరాలలో కొండలన్నీ ఎండిపోక చిగురుపెట్టక వుండే చెట్లతో కళాహీనంగా కనిపిస్తాయి సారహీనమైన సంసారంలా వన్నె తగ్గి ఉసూరుమంటున్నట్లుంటాయి కొన్ని కొండలు చూద్దామన్నా మచ్చుకు ఒక చెట్టయినా లేక బోసిపోయి వున్నాయి

మా బస్సులో వచ్చిన గైడు పేరు చవాన్, కేదార్‌లో పచ్చని చెట్లు విరివిగా వుంటాయి కనుక ఏమీ అనిపించదు. కాని బదరీలో చెట్లు లేవు బాగా ఎత్తుకు పోవటం వల్ల గాలి వొత్తిడి తగ్గి ఆక్సిజన్ సరిగా అందదు నడిచేటప్పుడు మాట్లాడకూడదు మాట్లాడితే ఆయాసం వస్తుంది అందుకని అక్కడ ఎటు తిరిగినా నెమ్మదిగా నడవాలి మౌనంగా వుండాలి - అని గైడు చెప్పాడు

గదిలో వుండగా బాగానే వుండేది కాని బయటికి వచ్చినప్పుడు మాత్రం ఊపిరి పీల్చటం కష్టంగా వుండేది నాకే కాదు, అక్కడ ఎవరికైనా అంతే, మనిషి ముందూ వెనకా ఆలోచించకుండా, ఆశకొద్దీ చెట్లన్నిటినీ కొట్టివేయడం వల్ల కలిగిన దుష్ఫలితం అది

నాకు మాత్రం డాక్టర్ నాగభూషణంగారు మాత్రలు యిచ్చి వీటిని వేసుకుంటూ వుండండి! ఆయాసం రాదు! అన్నారు. అందువల్ల నేను ఏ ఆయాసం లేకుండా హాయిగా యాత్ర చేయగలిగాను యాత్రలో ఆయనను తలచుకోని నిముషం లేదు ఆయన ఆ మాత్రలు యివ్వకపోతే నేను ఎంత అవస్థపడేధాన్నో, దేవుడికే తెలియాలి!

బస్సు అలాగే పర్వతాలను ఒక్కొక్కటే దాటుకుంటూ జోషికుండు చేరింది అక్కడ నరసింహాలయం వుంది నరసింహుడు గుహలో వున్నాడు బయట నరనారాయణులు, శివపార్వతులూ, గరుత్మంతుడూ, గపదున్గలా వున్నారు నరసింహస్వామి సాధారణంగా గుహలలోనే వెలుస్తాడు ఇప్పుడు నరసింహ స్వామి మీద బాబు రాస్తున్న పుస్తకం గుర్తుకు వచ్చింది. భార్గవగారు (సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగి, శ్రీ వి. వి శ్రీధర్ గురూజీ శిష్యులు) దృష్టి లేకపోయినా యీ యాత్రలన్నీ

తిరిగారు అది మామూలు విషయంకాదు. ఆయనలో వున్న భక్తికీ, దీక్షకూ, పట్టుదలకూ మనోనిబ్బరానికీ అది గుర్తు బహుశా మావూరి నరసింహస్వామి ఆలయంలో వుండే అచ్యుతాచార్యులవారికి వలెనే భార్గవగారికి కూడా అంతర్నేత్రాలున్నాయేమోననిపించింది.

బదరీలో కేరళకు చెందిన నంబూద్రి బ్రాహ్మణులను అర్చకులుగా శంకరాచార్యులవారు నియమించారట! అప్పటి నుండి అక్కడ దక్షిణాదివారే అర్చకులు, ఈ విధంగా ఆసేతు హిమాచలం (దక్షిణాన సేతువు నుండి ఉత్తరాన హిమాలయాలవరకు) అని భారత దేశం గురించిన వర్ణన చక్కగా సరిపోతున్నది.

బదరీలో వుండే అర్చకులు సంవత్సరానికి ఆరు నెలలే బదరీలో వుంటారు మంచు ఎక్కువ కాగానే, వాళ్లు ఉత్సవ విగ్రహాలతో సహా దిగివచ్చి జోషీకుండ్‌లో ఆరునెలలు వుంటారు, ఇక్కడి దేవాలయంలో ఆ ఆరునెలలూ పూజ చేస్తారు అక్కడ లక్ష్మీఆలయం వుంది, కేదారులో కూడ ఆరునెలలె మానవుల పూజ తరువాత గుడి మూస్తారు. అప్పుడు ఆరు నెలలు దేవతల పూజ అంటారు కేదారులో నయితే అసలు ఇండ్లుకూడా వుండవు. తడవని-ప్లాస్టిక్ కాగితాలవంటి వాటితో పందిళ్లలాగా వేసుకొని వుండటమే. కేదారుకు వెళ్లే దారిలో దేవప్రయాగ, రుద్ర ప్రయాగ, కర్ణప్రయాగ, నంది ప్రయాగ-మొదలయినవి చూశాము. ప్రయాగ అంటే రెండు నదుల సంగమం.

జోషీకుండు నుండి బయలుదేరాము మళ్లీ స్వెట్టర్లు, శాలువలు, దుప్పట్లు కప్పుకొని బస్సు ఎక్కాం అక్కడినుండి మళ్లీ చలి, బస్సు సాయంకాలం 5 గంటలకు బదరీ చేరుకుంది. అక్కడ అంతా స్నానాలు చేశాం. బకెట్ వేడినీళ్లు రు 10/- తరువాత అంతా గుడికి వెళ్లాం. దర్శనం చేసుకొని బయటకు వచ్చాం. హారతి చూపించటానికి మనిషికి రు. 35/- టిక్కెట్టు. మనం ఏదయినా నాణెం యిస్తే, దానిని కుబేరస్వామికి తాకించి, మనకు దాచుకొనేందుకు యిస్తారు మేము హారతి చూసి కనులకద్దుకొని, నాణేలు కుబేరునికి తాకించినవి తీసుకొని వచ్చాము. అక్కడ యింకా కొన్ని గుళ్లు వుంటే చూసి వస్తుంటే దారిలో వేడినీళ్లు అంత చలిలో కూడా వేడిగా వుంటాయి అంతా అక్కడ స్నానాలు చేస్తున్నారు. పక్కనే నది ప్రవహిస్తూ

వుంది. కాని అందులో ఎవరూ స్నానాలు చేయటంలేదు ఎంతో చల్లగా వున్నాయి **నదిలో నీళ్లు** అందుకని అంతా వేడి నీటి కుండాల్లోనే స్నానాలు చేస్తున్నారు మేము **కాసిని నీళ్లు** నెత్తిన చల్లుకున్నాము

మిగిలిన వాళ్లు అక్కడ షాపింగ్ చేస్తున్నారు. నేను, ప్రేమ చేతగాక ఒక చోట కూర్చున్నాము, బదరీలో బజార్లు అవీ చాలా నీటుగా వున్నాయి. దేవాలయాలు బాగానే వున్నాయి.

మేం రూంకు వచ్చి పరుపులు కప్పుకొని పడుకున్నాము. చీకటిలో లేచి కాలకృత్యాలు తీర్చుకొని, వేణ్ణీళ్లు తెప్పించుకొని అంతా స్నానం చేశాము వాడు కూడా ఆ కుండం నుంచే వేణ్ణీళ్లు తెచ్చిచ్చి, బకెట్‌కు రూ. 10/– తీసుకున్నాడు.

అంతా స్నానాలు చేసిన తర్వాత గుళ్లు చూసుకుంటూ బ్రహ్మకపాలానికి వెళ్లాము. అక్కడ గుళ్లో పెద్ద క్యూ వుంది. అది చూసి నేను అంతసేపు నిలుచోగలనా లేదా అన్న అనుమానంతో రానన్నాను. ఈ గుళ్లన్నీ రాత్రి చూసినవే. మళ్లీ తిరగలేను కాని బ్రహ్మ కపాలం ఒక్కటీ వచ్చి చూస్తానని చెప్పాను.

బ్రహ్మకపాలంలో నన్నొక చోట కూర్చోబెట్టి సంచులు, చెప్పులు, శాలువలు అన్నీ పడవేసి వాళ్లంతా గుడికి వెళ్లారు. రంగడు మాత్రం నా దగ్గరే కూర్చున్నాడు. ఇంతలో మధ్య మధ్య చినుకులు సాగాయి. వాన పెద్దదవుతుందేమో నని భయం, ఢిల్లీ వాళ్లు కూడా నన్ను చూసి సామాన్లు నాదగ్గర పడవేసి పిండప్రదానానికి వెళ్లారు. వాన పెద్దదైతే ఏం చేయాలో తెలియదు. అయితే దేవుడి దయ వల్ల వాన తగ్గింది. లేకపోతే చాలా యిబ్బంది అయేది.

రంగారావుగారు, శేషు బ్రహ్మకపాలంలో పిండప్రదానం చేశారు, రంగారావు గారు మావారికి, రామచంద్రం బావకు కూడా పిండప్రదానం చేశారు తరువాత చాలాసేపటికి అంతా వచ్చారు.

కేదారులో కన్నా బదరీలో, బదరీలో కన్నా హరిద్వార్‌లో చిత్ర విచిత్రమైన సామాన్లు, స్వెట్టర్లు, శాలువలు బాగా అమ్ముతున్నారు, తక్కిన వాళ్లంతా వెళ్లి కాసేపు షాపింగ్ చేశారు. తరువాత అంతా సామాన్లు తీసికొని వచ్చి సా॥ 2 గం॥కల్లా బస్సు దగ్గరకు వచ్చి బస్సెక్కాము.

హిమాలయాలు అయిదు ఖండాలని చెబుతారు, అందులో మొదటిది కేదార ఖండము అది శివుని ఆధీనంలో వుంది. అది శివునికి ఎంతో యిష్టమైనది ఆయన కది క్రీడాస్థలం అందువల్ల నారాయణుడు ఏదైనా ఉపాయం చేసి దానిని శివుని నుండి తీసికొనాలని యోచనచేశాడట ఒక రోజున పార్వతీపరమేశ్వరులు అలకనందలో స్నానానికి వెళ్లారట, అప్పుడు నారాయణుడు పిల్లవాని రూపంలో దారిలో ఏడుస్తూ కూర్చొని వారికి కనిపించాడు పార్వతి వానిని చూసి జాలిపడి శివునితో ఈ బాలుని రక్షించమని వేడుకొంది కాని శివుడు ఆ బాలుడు మాయావి అని చెప్పాడట అయితే పార్వతి జాలికొద్దీ ఆ మాట వొప్పుకొనక ఆ బాలుని యింటికి తీసుకొని వచ్చి నిద్రపుచ్చింది తరువాత శివపార్వతులు నదీ స్నానానికి వెళుతుండగా ఆ బాలుడు ఆ యింటిపై అధికారం సంపాదించాడు చివరకు ఈశ్వరుడు బదరీ వదిలి కేదారుకు వెళ్లి వుండాల్సి వచ్చింది

బదరీ అంటే రేగుచెట్టు రేగు చెట్టు లక్ష్మీనారాయణులకు నివాస స్థానం కనుక అది భగవంతునికి ఎంతో ప్రీతిపాత్రమైంది. బదరీ వనంలో ఈ చెట్టు నీడన భగవంతుడు తపస్సులో మునిగి వున్నాడు. ఇది నరనారాయణుల నివాసస్థానం అందుకే దీనిని నరనారాయణాశ్రమం అంటారు ఈ క్షేత్రానికి నారదుడే ప్రధాన అర్చకుడుగా వుండేవాడట అందుకే దీనిని నారద క్షేత్రమని కూడా అంటారు

ఇండోర్ మహారాణి అహల్యాబాయి ఈ దేవాలయ శిఖరంపై బంగారు కలశాన్ని ప్రతిష్ఠించింది

ఆలయ ద్వారాన్ని దాటి లోనికి వెళ్లగా వెండి సింహాసనం మీద బంగారు గొడుగు క్రింద శ్యామవర్ణంతో ధ్యానతత్పరుడైన బదరీ నాథుని (నారాయణుడు) విగ్రహం వుంది విగ్రహం దాదాపు చెయ్యి ఎత్తున వుంది. భగవానుని కుడి వైపున నరనారాయణ విగ్రహాలు, శ్రీదేవి, భూదేవి, వీణా సహితంగా నారదుడు, ఉద్ధవుడు వున్నారు స్వామి వారి పాదుకలు కూడా వున్నాయి

బదరీనాథుని విగ్రహంలో నాభి సమీపాన ఎరుపు రంగుతో మంచి గంధపు బొట్టు వుంటుంది రెండు తొడలపైనా చిన్న చిన్న తిలకపు బొట్లుంటాయి

ముఖం పద్మంలా వుంటుంది ముఖానికి రెండు వైపులా ఆయన జుత్తు వేలాడుతూ వుంటుంది ఆట్టి బదరీనారాయణుని సేవించటానికి దేవతలే వచ్చి నిరీక్షిస్తుంటారని అంటారు

బదరీనాథుని వామ భాగాలలో బాలబ్రహ్మచారి అయిన నారదుని విగ్రహం ఉంది శాస్త్ర పద్ధతిననుసరించి, ఈ ఆలయాన్ని మార్గశిరమాసంలో మూసివేస్తారు అప్పుడు నారదుడే స్వయంగా స్వామికి అర్చన చేస్తాడని ప్రతీతి నారదునికి ఒక శాపం వుంది దక్ష ప్రజాపతి ఆయనను ఏ వొక్క చోట కూడా రెండు గడియలకు మించి వుండరాదని అన్నాడట అయితే విష్ణువు అనుగ్రహించిన వరం వల్ల నారదుడు బదరిలో మాత్రం ఆరు నెలలపాటు స్వేచ్ఛగా స్వామి పూజలో నిమగ్నుడై వుండగలుగుతున్నాడు వైశాఖం నుండి కార్తీకం వరకు యిక్కడ మానవుల పూజ కాగా, మార్గశిరం నుండి చైత్రం వరకు నారదుని పూజ

బదరీ దేవాలయంలో స్వామి విగ్రహానికి కుడి భాగంలో కుబేరుని విగ్రహం వుంది ఆయన ఉత్తర దిక్పాలకుడు, దేవతల కోశాధిపతి, సంపదలకు అధినాధుడు

బదరీ నాధునికి ఎడమ వైపున అఖండ జ్యోతి వుంటుంది. ఇది గుడి తీసి వుండే రోజులలోనే కాదు గుడి మూసివేసి వుంచిన ఆర్నెల్లూ ఆరిపోకుండా వెలుగుతూనే వుంటుంది. దీపాన్ని వెలిగించి వుంచి ద్వారాన్ని మూసివేస్తారు ద్వారాలను తెరచేరోజున చూస్తే ఆరు నెలల తర్వాత కూడా దీపం వెలుగుతునే వుంటుంది ఈ అఖండ జ్యోతి దర్శనం కోసం మందిరాన్ని తెరచే రోజున వేలాది భక్తులు వస్తారు

బదరీనాధ దర్శనం తర్వాత ఆయన ఎడమ చేతివైపున వెళితే లక్ష్మీదేవి ఆలయం వస్తుంది

బదరీ ఆలయాన్ని, బదరీనాధుని మనసులో స్మరించినా చాలు, అనేక సంవత్సరాలు ఘోర తపస్సు చేసినంత ఫలం లభిస్తుంది. సమస్త భూమిని దానం చేసిన ఫలితం సిద్ధిస్తుంది

అటువంటి బదరీనారాయణుని దర్శించి, మనసారా నమస్కరించి, వచ్చి బస్సెక్కాం అందరి సహాయం వల్ల చక్కగా కేదార్, బదరీ యాత్రలను సునాయాసంగా చేయగలిగాం

## హరిద్వార్ :

బస్సు నెమ్మదిగా ఒక్కొక్క పర్వతాన్నే దిగుతూ బయలుదేరింది. ఆరోజు నాకు కంట్లో నలక పడి కొంతసేపు బాధపెట్టింది మళ్లీ వెళ్లేటప్పుడు మేం చూసిన జోషీమఠ్‌కు వచ్చాం అక్కడ శంకరాచార్యులు స్థాపించిన శంకర్ మఠం వుంది. దేశంలో ఆదిశంకరులు స్థాపించిన నాలుగు శంకర్ మఠాల్లో అదొకటి. ఆ మఠాన్ని వెళ్లిచూసి రమ్మన్నారు గాని అంత ఎత్తు ఎక్కలేక ఎవరూ బస్సు దిగలేదు జోషీ మఠ్‌లో ఎన్ని రకాల పూలో వున్నాయి రకరకాల గులాబీలు, క్రోటన్స్ కనిపించాయి. అమ్మవారి పూజకు ఎర్రటి గులాబీలు విరగపూసి వున్నాయి.

## గౌరీకుండ తీర్థ మహాత్మ్యము :

గౌరీ తీర్థ ప్రభావాన్ని పార్వతీదేవికి శివుడు ఇట్లు వివరించి చెప్పెను : పార్వతీ! నా కేదార భవనం నుండి నాలుగు కోసుల దూరములో కోరిన కోరికలన్నిటినీ సిద్ధింపజేయు గౌరీకుండ తీర్థము కలదు నీవు మందాకినీ నది వొడ్డున కార్తికేయుని జననమునకై ఋతుస్నానమాచరించిన స్థలమే గౌరీతీర్థము అక్కడి నీరు వేడిగానూ తీక్షణముగానూ ఉంటుంది. అచటి మన్ను సింధూర వర్ణము. ఆ పర్వతము పైననే దుఃఖములను పోగొట్టు కాళీమాత నివసించును.

## గుప్త కాశీ మహాత్మ్యము :

గుప్త కాశి అను స్థలము కాశీలో దాగియున్నది. దానిని స్మరించినంతనే మహాపాపములు సైతము నశించును.

## మధ్యమేశ్వర మహాత్మ్యము :

కేదార క్షేత్రానికి దక్షిణంగా పోవు దారిలో మూడు యోజనముల దూరంలో మూడు లోకములలోను రహస్యంగా నుండు మధ్యమేశ్వర క్షేత్రం వుంది. దానిని దర్శించినంత మాత్రం చేతనే మానవులు శివ భక్తులై శివలోకాన్ని చేరుకోగలరని శివుడు పలికెను.

## రుద్రనాథ మహాత్మ్యము :

శివుడిట్లు చెప్పెను. "రుద్రనాథ మహాత్మ్యం వినినచో మానవులు పాపము నుండి విముక్తులగుదురు. దర్శనం వల్లనే ముక్తి లభించును అక్కడ నా త్రిశూలపు చిహ్నం వుంది. ఎవరైననూ ఎంత బలముపయోగించి కదిపిననూ అది కదలదు. కాని భక్తి పూర్వకముగా చిటికెనవేలితో ఆడించిననూ, అది ఆడును అక్కడ ఒక పొదరిల్లు కలదు అందన్ని కాలములలోనూ పూలు పూయును గోపేశ్వర తీర్థంలో ఐదు రాత్రులు జపం చేసిన దేవతలకు సైతము సాధ్యం కానివి కూడా సిద్ధించును."

## గరుడ గంగా మహాత్మ్యము :

గరుడ గంగలో స్నానం చేసి విష్ణురూపంలో వున్న గంగను పూజించి తరించవచ్చును.

## కపిలేశ్వర మహాత్మ్యము :

కపిలేశ్వరంలో అక్కడక్కడ శివలింగాలున్నాయి. ఆ లింగాల నన్నిటినీ దర్శించిన శివలోకమున కేగి, పూజలందుకోగలరు.

## పంచ బదరి :

ఇక్కడ వృద్ధ బదరీశ్వరుని ఆలయం కలదు.

## జ్యోతిర్మఠ రహస్యం :

ఇక్కడ ముక్తినిచ్చు నరసింహ రూపంలో భగవంతుడున్నాడు. అక్కడ సాక్షాత్తు నవదుర్గలు, వాసుదేవుడు ఉన్నారు. భక్తుడైన ప్రహ్లాదుడు హరిని భజిస్తూ వుంటాడు.

## పాండుకేశ్వరం :

ఇక్కడ భక్తుల కోర్కెలను తీర్చే స్వామి కలదు

## ఋషి గంగ :

ఇక్కడ ఋషిగంగ, కూర్మధార, ప్రహ్లాద ధార వున్నాయి. ఋషి గంగలో

స్నానం చేసి, నీరు తాగిన బ్రహ్మత్వం లభిస్తుంది ప్రక్కనే గల ప్రహ్లాద ధారలో స్నానం చేసి, ఆచమించిన భక్తి, జ్ఞానం లభిస్తాయి

## తప్తకుండం :

దీనినే అగ్నితీర్థం అంటారు ఇక్కడ స్నానం చేసిన మహాపాతకాలు కూడా నశిస్తాయి.

## నారద కుండం :

కలికాలంలో ప్రజల మనసులలో ధర్మచింతన తగ్గిపోయి, కుటిలమైన ఆలొచనలు ఎక్కువవుతూ వున్నాయి భగవంతుడది చూసి, నేను శ్రీ శంకరాచార్యులుగా అవతరించి లోక హితార్థం నారద కుండం నుంచి ఒక విగ్రహాన్ని తీసి వేరొక చోట ప్రతిష్ఠిస్తాను ఆ విగ్రహాన్ని దర్శించి, అర్చిస్తే చాలు, మానవులు పాప విముక్తులౌతారని సెలవిచ్చారు

## బదరీ నారాయణ మహాత్మ్యము :

లక్ష్మీదేవి స్వహస్తాలతో వండిన నైవేద్యాన్ని నారాయణుడు భుజించును అని చెబుతారు బదరీ నారాయణుని మనస్సులో స్మరించిన మాత్రముననే ఘోర తపస్సు చేసినంత పుణ్య ఫలం లభించును

ఆ తరువాత మేము వసుధార, సత్యపథ తీర్థం, భవిష్య బదరీ, హేమకుండం, నందప్రయాగ, కర్ణ ప్రయాగల మీదుగా హరిద్వార్ చేరుకున్నాము రాత్రి 6 గంటలకు ఎక్కడికో అక్కడికి చేరి ఒక చోట రూములు తీసికొని పండుకోటం, తిరిగి తెల్లవారు ఝామున నాలుగింటికే బస్సెక్కటం – ఇదీ మా దినచర్య భోజనాల టైముకు ఏదో ఒక హోటలు ముందాపేవాడు. అంతా దిగి భోజనాలు చేసి రాగానే మళ్లీ బస్సు బయలుదేరేది మా బస్సుకు వచ్చిన డ్రైవరు, క్లీనరు, గైడు చవాన్ కూడా చాల మంచివాళ్లు యాత్రికులను, సామాన్లను కూడా చాలా జాగ్రత్తగా కనిపెట్టుకొని చూస్తుండేవాళ్లు మాకు మాతో స్వర్ణ, సురేష్ వాళ్లు రావటం వల్ల ఎంతో ఉపయోగంగా వుంది. వాళ్లు ప్రతి వాళ్లనీ ప్రత్యేకంగా మాటి మాటికీ ఏంకావాలో కనుక్కుంటుండేవాళ్లు. శేషు, రంగడు సామాన్ల విషయం

జాగ్రత్తగా చూసుకుంటూ వచ్చారు శారదక్కయ్య 'రంగడు రావటం నాకు చాలా సౌకర్యంగా వుంది' అని ఎన్నిసార్లో అనుకుంటుండేది

హరిద్వార్‌లో అంతా కావలసిన బట్టలవీ తీసుకొని గంగా స్నానానికి వెళ్లారు గంగలో స్నానం చేసిన వాళ్లకు తలా రు 50/- యిస్తానని రంగారావు గారు పందెం వేశారు ఎందుకా అనుకున్నాం తీరా చూస్తే నీళ్లు మంచులా వున్నాయి. నీళ్లలో వేలు ముంచితే అంతవరకు గడ్డ కట్టేలా యిఘంలా వున్నాయి. అయినా యింత దూరం వచ్చి, గంగా స్నానం చేయక ఎలా అని అంతా స్నానాలు చేశాం బట్టలు మార్చుకొని కొండపై మానసాదేవి మందిరానికి వెళ్లాము. ఉయ్యాలలను హెలికాప్టరు లాగా ఏర్పాటు చేసి కరెంటు సహాయంతో యాత్రీకులను పైకి కిందికి చేరవేసే 'రోప్‌వే' అనే యాంత్రిక సాధనాన్ని అక్కడ ఏర్పాటు చేశారు మేము దానిలో ఎక్కి కొండ పైకి చేరాము. విమానంలో ఎక్కి వెళ్లినట్లుగా అనిపించింది. పైకి చేరిన తర్వాత మానసాదేవి, వైష్ణవీదేవి, చాముండీదేవి యిలా ఏవో గుళ్లు చాలా వున్నాయి చాముండీ దేవి గుడి వద్ద ఒక చెట్టు నిండా పోగులు కట్టి వున్నాయి. రెండు రూపాయలకు ఒకటి చొప్పున పోగులు కొని ఏదైనా కోరిక కోరుకొని ఆ చెట్టుకు పోగు కట్టితే, ఆ కోరిక తప్పక నెరవేరుతుంది అంటారు. అంతా తలా వొక తాడు తీసికొన్నారు నాక్కూడా వొకటి యిచ్చారు నీవు గూడా ఏదయినా కోరిక కోరుకొని చెట్టుకు కట్టమని చెప్పి హరిద్వార్ వంటి క్షేత్రంలో వుండి కూడా ప్రాపంచికమైన కోర్కెలేనా అని నన్ను యిలాగే సునాయాసంగా యాత్రలు చేయిస్తూ వుండు తల్లీ! అని ప్రార్థించి పోగు కట్టాను అక్కడ అంతా గొర్రెదాటు వ్యవహారంలాగా తయారయింది రెండు రూపాయలేగా అనో, ఒకర్ని చూసి వొకరు వేలం వెర్రిగానో మొత్తం మీద అంతా తలా వొక తాడు ఆ చెట్టుకు కట్టి వచ్చారు. కరెంటు వుయ్యాల 6 గంటలు దాటితే బందవుతుంది అందుకని అందరం గబగబా అన్ని చూసేసి వచ్చి, ఉయ్యాల ఎక్కి కిందికి దిగి వచ్చాము

ఆ తరువాత కాసేపు షాపింగ్ చేశారు అందరం కేదార్, బదరీ కేసెట్లు తీసికొన్నాము కేదార్ బదరీ యాత్రను కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి ఆ కేసెట్లు

సాయంకాలం గంగ వొడ్డున 'హారతి' కార్యక్రమం వుంటుంది అందుకని అందరం గంగ వొడ్డుకు వెళ్లాము అప్పటికే జనం వచ్చి రెండు వైపులా మెట్లపై

కిక్కిరిసి కూర్చొని వున్నారు. పూలతో నింపిన దొప్పలలో నెయ్యి వత్తులు వేసి, దీపం వెలిగించి గంగలో వదిలే కార్యక్రమం అది. స్వర్ణ దొప్పలు కొని తెచ్చి, అందరికీ తలా వొకటి యిచ్చింది. గంగ వొడ్డుననే గంగా మాయి గుడి, రాధాకృష్ణుల గుడి వున్నాయి. అక్కడ ఒక బ్రాహ్మణుడు కూర్చుని వత్తులు వెలిగించి యిస్తాడు. మనం ఆ దొప్పలను తీసుకొని వెళ్లి గంగలో కలపాలి. వేలాది దొప్పలు నీటిపై తేలుతూ వెళ్లుతూ వుంటే గంగ అంతా దీపాలతో మెరుస్తూ నక్షత్రాలు నిండిన ఆకాశంలా వెలిగిపోతూంటుంది. ఆ సుందర దృశ్యాన్ని చూడటానికే వేలాదిగా జనం గుమిగూడతారు. గంగ పొడుగునా బ్రాహ్మణులు దీపాలు వెలిగించి హారతి యివ్వటం, ఆ దీపాలు గంగ నిండా నిండి నీటివాలున కొట్టుకొని దూరంగా పోతూవుండటం చూస్తే జన్మ ధన్యం అయిందనిపిస్తుంది. ఆ తరువాత శిరిడీ సాయిబాబాకు హారతి యిస్తున్నప్పుడు చాలాసేపు హారతి పాడినట్లు హిందీలో మంగళహారతి పాట వంటిది అంతా కలిసి పాడతారు. అది చాలాసేపు జరిగింది. హారతి అయిందాకా వుండి అందరం హోటల్‌కు వచ్చాము. కాఫీ తాగాలనిపించి ఎంతో తిరిగాం కాని అక్కడ ఎక్కడా కాఫీ దొరకలేదు. ఇంతలో గైడు చవాన్ కనిపించి మాకో మంచి హోటలును చూపించాడు. అక్కడ టిఫిన్ చేసి కాఫీ తాగాం. అక్కడికి కూడా గంగ వెంట వెళుతున్న వేలాది దీపాలు కనిపిస్తూనే వున్నాయి. రాత్రి పదిగంటలైనా ఆ దీపాలలా వస్తూనే వున్నాయి. నాకారోజు ఎందుకో టిఫిన్ తినబుద్ధి కాలేదు. బస్సు దగ్గరకు వచ్చిన తర్వాత అక్కడ ఒక లస్సీ తాగాను.

ఇంతలో అక్కడ ఒకామె ఎందుకో ఏడుస్తూవుంది. ఏమిటి సంగతి అంటే ఆమె తాను వచ్చిన బృందం నుండి విడిపోయింది. తమ వాళ్లంతా ఎటుపోయారో ఆమెకు తెలియలేదు. అందుకని భయంతో ఒకటే ఏడుపు. స్వర్ణ ఆమె దగ్గరికి పోయి ధైర్యం చెప్పి తీసుకొనిపోయి పోలీస్ కంప్లైయింట్ యిచ్చింది. ఆమెను 'మీవూరేది?' అంటేనే చెప్పలేకపోయింది. 'ఏ బస్సులో వచ్చావు? బస్సు నెంబరెంత?' అంటే ఇంక ఏం చెప్పగలుగుతుంది? అందుకే గోపి మమ్మల్ని అందరనూ అడ్రసులు రాసిన కాగితాలు దగ్గర వుంచుకోమన్నాడు. నేను మా బస్సు నెంబరు 6595 గుర్తుంచుకున్నాను. ఇంతలో వాళ్లవాళ్లు ఈమెను వెతుక్కుంటూ వచ్చి, ఆమెను తీసికొని పోయారు. మేము కూడా మా బస్సు దగ్గరకు వచ్చి ఎక్కాము.

బస్సులో వాళ్లంతా నా దగ్గరకువచ్చి 'మామ్మగారు! మేమంతా మీతో గ్రూప్ ఫొటో తీయించుకోవాలని అనుకుంటున్నాము, రండి!' అని బ్రతిమిలాడారు. వాళ్లంతగా చెబుతుంటే కాదనటం ఎందుకని అంతా బస్సు దిగాం ఒక బల్ల తెచ్చి వేసి మమ్మల్ని అయిదుగురినీ కూర్చోబెట్టారు వాళ్లంతా చుట్టూ నిలుచొని ఫొటో దిగారు. తరువాత తక్కినవాళ్లు కూడా తీసికొన్నారు గైడ్ చవాన్ వచ్చి 'మళ్లీ మీరంతా వచ్చే ఏడుకూడా రండి! అప్పటికి నేను తెలుగు నేర్చుకుంటాను' అన్నాడు మా బస్సుకూ, మరో బస్సుకూ కలిపి చవాన్ గైడుగా వున్నాడు. రెండో బస్సులో ఒక పిల్లవాడికి అకస్మాత్తుగా సుస్తీ చేసి సీరియస్ అయి ఆసుపత్రిలో చేర్చారు. అందుకని ఆ రెండో బస్ బయలుదేరలేదు. చవాన్ అక్కడ వాళ్లతో వుండిపోయాడు తెల్లవారితే అంతా విడిపోతాం. ఎటువాళ్లం అటే! ఈ నాలుగు నాళ్ల కలయికలోనే ఎంతో ఆత్మీయతను సంతరించుకున్నాం. ఇక విడిపోతున్నామన్న బాధతో గుండె భారమయింది. అంతా హృదయభారంతో బస్సెక్కాం.

అంతా క్షేమంగా ఢిల్లీ చేరుకున్నాం. బస్సు ఢిల్లీ రైల్వే స్టేషన్ దగ్గర ఆపారు. మేమంతా దిగి అక్కడకు కొద్ది దూరంలోనే వున్న మా బస వద్దకు నడిచి వెళ్లాము సామాన్లు వెనక రెండు రిక్షాలలో వచ్చాయి. మాకు 3వ అంతస్థులో ఒక గది యిచ్చారు కింద అంతస్థులో యింకో గది ఖాళీ అవుతుంది. కాగానే యిస్తామన్నారు. అందుకని నేను, శారదక్కయ్య కిందనే వుండిపోయాం తక్కిన వాళ్లంతా పైకి వెళ్లారు. మేం మొహాలు కడుక్కొని కాఫీలు తాగి సేద తీరాము. తరువాత అంతా స్నానాలవీ కానిచ్చి హాయిగా పడుకొని నిద్రపోయాము.

రంగడు, శేషు బాగా అలసిపోయారు. వెంటనే గాఢ నిద్రలో మునిగిపోయారు. నేనొక్కదాన్ని రాసుకుంటూ కూర్చున్నాను. ఋషీకేశ్ వరకు ఎప్పటిదప్పుడే రాస్తూ రాగలిగాను. కాని కేదార్, బదరీ యాత్రలలో చలికి పెన్ను పట్టుకొని రాయటం సాధ్యం కాలేదు తిరుగు ప్రయాణంలో ఒక హోటలులో దిగి నప్పుడు రాసుకుందామంటే ఆనాడక్కడ కరెంటు లేదు ఇక బదరీలో కూడా విపరీతమైన చలి, పైగా ఒక రోజంతా కంట్లో నలకతో బాధ ఇలా మొత్తం మీద నా రాత కుంపులో పడింది. ఎప్పటికప్పుడు రాస్తూపోతే యింకా ఎక్కువ సంగతులు రాయటానికి వీలయేది. కేదార్ నుంచి హరిద్వార్ చేరేదాకా రాయటం పడక

అడవులు, ఆయా రమణీయ ప్రకృతి దృశ్యాలూ గంగమ్మతల్లి ఉరుకులు, పరుగులూ చూస్తుంటే ఎంతో ఉత్సాహం కలిగి ఎంతో రాయాలనిపిస్తుండేది కాని రాయటం పడలేదు ఢిల్లీ రాగానే. ఆలసటగా వున్నా. వీలయినంత వరకు గుర్తు తెచ్చుకొని రాయటం జరిగింది అందుకే అంతా పడుకొని నిద్రపోతున్నా, నాకు నిద్రపోవడం పడలేదు.

ఎండ బాగా వుంది అంతా నిద్రలేచారు అన్నం, పెరుగూ మీ గదికి తెప్పించుకొని మీ దగ్గర గల పచ్చళ్లు, పొడులు వేసికొని తినండి! అక్కడ మీరేమీ తినలేరు. అని చెప్పారు అంతా అలాగే చేశాం పెరుగు మాత్రం కాశీలా పెరుగు లాగా బాగావుంది అన్నాలు తినటం ఆలస్యం, అంతా బాగా సొక్కుమీద వున్నారేమో, పడుకొని నిద్రపోయారు నేను గూడా ఒక గంట పడుకొని లేచి, కూర్చొని రాసుకున్నాను సాయంత్రం అయిదింటికి అంతా షాపింగ్‌కు బయలుదేరారు. మొదట ఢిల్లీకి తిరిగి రాగానే అక్కడ చూడాల్సిన వన్నీ తిరిగి చూద్దాం అనుకున్నాం కాని ఎవరికీ ఓపిక లేకపోయింది. హరిద్వారంలో బాగా తిరగటం దానికి కొంత కారణం

దగ్గరలో వున్న బజారుల్లోనే కాసేపు తిరిగి ఏవేవో కొనుక్కొని రాత్రి 8గంటల లోపల బసకు చేరుకున్నాం బేగులు, సూటుకేసులు కొంతమంది కొన్నారు భారతి వాళ్ల మనవడికి (మహర్షి) మనవరాలికి ( ప్రియాంక ) బట్టలు తీసుకొంది. మళ్లీ అందరం పెరుగు, అన్నం మాత్రం తెప్పించుకొని తినేసి రైలు స్టేషన్‌కు చేరుకున్నాం స్వర్ణకు నిన్నటి నుండి వంట్లో బాగా లేదు. అయినా మందుల పవర్ మీద ఎట్లాగో ఓపిక చేసుకొని తిరుగుతూ వుంది. ఢిల్లీలో రైలు ఎక్కేటప్పుడు కొంచెం చికాకు అయింది. భారతి, రంగారావుగారు ఒక చోట, సురేష్, స్వర్ణ ఒకచోట, శేషు, రంగడు ఒక చోట – మేమంతా ఒకచోట ఎక్కాము. రాత్రి పదిగంటలయింది. మాకందరికీ బెర్తులు దొరికాయి భారతి వాళ్ల సామాను గాక మొత్తం సామాన్లు 35 అన్నీ మా దగ్గరే పెట్టారు మాకు ఎదురుగా వున్న బెర్తుపై రాజస్థాన్ నుంచి గుంటూరు పోతున్న ఆవిడ వుంది ఆమె పుట్టిల్లు రాజస్థాన్. అత్తవారిల్లు గుంటూరు. ఆమె అయిదేండ్ల కొకసారి పుట్టింటికి వొచ్చి పోతుందిట.

అందువల్ల ఆమెకూడా చాలా సామానుతో ఎక్కింది అవీ, యివీ కలిపి మెసిలేందుకు సందు లేకుండా వున్నాయి. అలసట వల్ల వాళ్లు తెలియకుండా నిద్రపోయాం యాత్రకు వచ్చేటప్పుడు ఏసి బెర్తులు దొరికాయి కనక హాయిగా వచ్చాము పోయేటప్పుడు ఏసి లేదుగదా ఎండ బాగా వుంది

ఉదయం లేచి ఉప్మా తెప్పించుకొని తిని తిరిగి పడుకున్నాం బాగా నిద్ర పట్టింది సాయంకాలం లేచి వడలు ఫలహారం చేసి మళ్లీ పడుకున్నాం ఇన్నాళ్లూ యాత్రల సందర్భంలో మాలో కనబడకుండా దాక్కున్న అలసట అంతా ఒక్కసారి బయటకు వచ్చింది 14 ఏళ్లు వనవాసం చేసినా లక్ష్మణునికి నిద్ర, ఆహారం లేవు తీరా రామపట్టాభిషేకం సమయానికి నిద్ర ముంచుకొని వస్తే ఆయన నవ్వుకున్నాడట ఇంతలో వరంగల్ వస్తున్నదన్నారు పిల్లలు సామానంతా డోర్ దగ్గరకు ముందుగా చేర్చి వుంచారు మేమంతా ఇంకొక డోర్ నుండి దిగుతుంటే వాళ్లు సామానంతా చకచకా దింపేస్తారు అదీ ఏర్పాటు అందుకని మేమంతా ముందుగానే లేచి రెండో డోర్ వైపుకు వస్తుంటే, టిక్కెట్ ఎగ్జామినర్ చూసి 'అమ్మా! తొందరపడకండి। వరంగల్ రాగానే నేను మిమ్మల్ని దింపుతాను' అన్నాడు, మేము దానికి బదరీ, కేదార్ యాత్ర చేసి వస్తున్నాం కనుక మా సామాన్లు చాలా వున్నాయి అందుకని సామాన్లు ఒక వేపు, మేం ఒకేపు దిగుతున్నాం అందుకని ముందే లేచి డోర్ దగ్గర్లోకి వచ్చి కూచుంటున్నాం అని చెప్పాము అది విని ఆయనకు ఎంతో ఆశ్చర్యం వేసింది ఆయన నవ్వి ఈ వయసులో అంతటి కష్టమైన యాత్ర ఎలా చేసి వచ్చారమ్మా! మీ సాహసానికి మిమ్మల్ని మెచ్చుకోవలసిందే మీకేం భయం లేదు మీరు, మీ సామాన్లు అన్నీ క్షేమంగా దిగేవరకు రైలును నేను కదలనివ్వను. కంగారుపడకుండా దిగండి అని ధైర్యం చెప్పాడు వరంగల్ వచ్చేదాకా ఆయన ఎంతో ఆసక్తిగా మా యాత్రా విశేషాలను గురించి మాతో మాట్లాడుతూ కూర్చున్నాడు. ఇంతలో వరంగల్ వచ్చింది అంతా నెమ్మదిగా దిగాం. సామానంతా దింపారు రైలు దగ్గరికి జయ, శర్మగారు, మురళి వచ్చారు వాళ్లు వరంగల్‌లో లేరేమోననుకొని మేం వరంగల్ నుండి వేరే రైలులో హైదరాబాదు వెళ్లాలని అనుకున్నాం కాని శర్మగారు వాళ్లు మమ్మల్ని బలవంతం చేసి ఇంటికి తీసుకొని వెళ్లారు. శారదక్కయ్యను మురళి తన యింటికి తీసుకొని వెళ్లాడు. విమల ఎక్కడికీ రానంది. అందుకని విమల, సావిత్రీ, శేషు ఖమ్మం వెళ్లారు వాళ్లను రైలెక్కించి మేమంతా వరంగల్ టౌనులోకి

బయలుదేరాం. జయ వాళ్ల యింటికి వెళ్లి స్నానాలు చేసి, జయ వడ్డించిన వేడి వేడి అన్నం కూరలతో ఇంటి భోజనం - ఎన్నాళ్ల తరువాతనో - చేసి హాయిగా నిద్రపోయాం. మర్నాడు జయ మా బట్టలన్నీ ఉతికించి ఇస్త్రీ చేయించి, సర్ది పెట్టింది. ప్రయాణం బడలిక చాలా వరకు జయ యింట్లోనే తీరింది మర్నాడు వెళ్లి పెద్దవాళ్లైన జయ అత్తగారికీ, ప్రేమ అత్తగారికీ దణ్ణం పెట్టివచ్చాము

ఎండ బాగా వుంది సాయంకాలం 5 గంటల బస్సుకు టిక్కెట్లు తెచ్చారు జయ, శర్మగారు మాపట్ల ఎంతో ఆపేక్ష పడ్డారు. ఆ రాత్రికి హైదరాబాదు క్షేమంగా చేరుకున్నాము. బాబుకు, శీనప్పకు, మనోహర్‌కు ఫోన్ చేసి మాట్లాడాము. వాణి 'బామ్మల బదరీ యాత్ర' అయిందా? అన్నది. యాత్ర జయప్రదంగా పూర్తి చేసుకొని క్షేమంగా తిరిగి వచ్చినందుకు అంతా ఎంతో సంతోషించారు. ఈ యాత్ర కలా? నిజమా? అన్నట్లు సినిమా రీలులా చకచకా జరిగిపోయింది

నాకు తెలియకుండానే గోపీకి ఫోన్ చేసి నా ప్రయాణం ఖాయం అయేలా చేసిన రంగారావు గారికీ, నాకు వెంటనే పైకం యిచ్చి నన్ను యాత్రలకు పంపిన గోపీకి, యాత్రలో మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన స్వర్ణ, సురేష్ దంపతులకూ, మాసామాన్ల భారం వహించి, తాము పడే శ్రమను లెక్క చేయకుండా మా యాత్రను విజయవంతం చేసిన మాకేమాత్రం శ్రమ లేకుండా చూసిన శేషు, రంగడులకు, భగవంతుడే మాకు తోడు నీడగా వస్తాడని, మీరంతా కలిస్తే ఉత్సాహంగా యాత్ర చేసి రాగలరు అని ధైర్యం చెప్పి, శుభాకాంక్షలు పలికి పంపిన బంధుమిత్రులకు - ముఖ్యంగా, మా యాత్రలో ఉపయోగపడేందుకు కావలసిన మందులు యిచ్చి ధైర్యంగా వెళ్లిరండి అని ప్రోత్సహించి పంపిన డాక్టర్ నాగభూషణం గారికి, డాక్టర్ మనోహర్‌కూ, మా యాత్ర క్షేమంగా, విజయవంతంగా పూర్తికావటానికి తోడ్పడిన బస్సు సిబ్బందికీ, గైడు చవాన్‌కూ, డోలీలు మోసిన కార్మిక సోదరులకూ, ఇంకా అసంఖ్యాకులైన సహృదయులకూ మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

శుభమస్తు

# మా వైష్ణవీ దేవి ఆలయ యాత్ర

చాలాకాలం నుండి మా నాన్నగారికి జమ్ములోని 'వైష్ణవీదేవి' ఆలయాన్ని సందర్శించాలని కోరిక ఉండేది అయితే దానికి సంబంధించి సరైన సమాచారం అందుబాటులో లేకపోవటంతో అది కోరికగానే మిగిలిపోయింది. నిజానికి మాకు కూడా వైష్ణవీదేవి ప్రాశస్త్యం తెలియనప్పటికి, పచ్చదనం నిండిన కాశ్మీర్‌ను చూడ వచ్చునన్న ఉద్దేశ్యంతో ఆలయ సందర్శన గురించి ఉబలాటపడ్డాము ఇంతలో జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదం పెచ్చుపెరగటంతో, మా కోరిక ప్రస్తుతానికి దాదాపు 'అసాధ్యం' అనే నిర్ణయానికి వచ్చాము.

## అనుకోని ఆహ్వానం

సరిగ్గా అలాంటి సమయంలోనే ఆర్మీలో ఆఫీసర్‌గా పనిచేస్తున్న స్వర్ణ వాళ్ళ అన్నయ్య 'కల్నల్ కె.ఆర్ రావు'గారికి జలంధర్ నుండి, జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని 'ఉద్ధంపూర్'కి బదిలి అయ్యిందని వర్తమానం వచ్చింది. ఆయన ఒకసారి మాకు ఫోన్‌చేసి, మేము ఉద్ధంపూర్ వస్తే, అక్కడి నుంచి వైష్ణవిమాత ఆలయ సందర్శనానికి అన్ని ఏర్పాట్లు చేస్తానని ఆహ్వానించారు. మేము దాదాపుగా అసాధ్యం అనుకున్న కోరిక నెరవేరబోతున్నందుకు ఎంతో ఆనందంతో జమ్ము ప్రయాణాకికి ఏర్పాట్లు చేసుకున్నాము. ఎలాగో, అక్కడిదాకా ప్రయాణం పెట్టు కున్నాం గాబట్టి, అక్కడి నుండి హరిద్వార్, కేదార్‌నాథ్, బదరీనాథ్ తదితర యాత్రా స్థలాలను చూడవచ్చని కార్యక్రమాన్ని నిర్ణయించుకొని దానికి మా పెద్దమ్మలను కూడా బయలదేరదీసాము మే 17వ తేదీన ఢిల్లీ నుండి హరిద్వార్ యాత్రకు అందరికి 'టిక్కెట్లు' బుక్ చేసుకున్నాము అమ్మా, నాన్న, నేను, స్వర్ణ. మాత్రం మే 13వ తారీఖునే బయలుదేరి, వైష్ణవిదేవి యాత్ర ముగించుకొని 17వ తేదీకి ఢిల్లి వచ్చేటట్లు మా ప్రయాణం ఖరారు చేసుకున్నాము.

## ప్రారంభం

అమ్మా, నాన్న, నేను, స్వర్ణ నలుగురం మే 13వ తారీఖు ఉదయం ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 14 ఉదయం ఢిల్లీచేరాము. అక్కడి నుండి బయలుదేరి

జమ్ము వెళ్లాము సరిహద్దు రాష్ట్రమైన జమ్ము-కాశ్మీర్‌కు రైలుమార్గం జమ్ము వరకు ఉన్నది ఢిల్లీ నుండి జమ్ముకు శ్రీనగర్‌కు, లఢక్‌కు విమాన సౌకర్యం ఉన్నది. ఎత్తైన కొండలతో, లోతైన లోయలతో విస్తరించి ఉన్న జమ్ము-కాశ్మీర్ రాష్ట్రంలో పర్యటనకు రైలు మార్గం కన్నా, రోడ్డు, వాయు మార్గాలే ఎక్కువ సౌకర్యంగా ఉంటాయి మేము జమ్ములో దిగగానే వాళ్ళ అన్నయ్య మమ్మల్ని 'రిసీవ్' చేసుకోవడానికి వచ్చారు. చురుక్కుమనిపించకపోయినా నును వెచ్చని ఎండ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. అక్కడంతా సామాన్య ప్రజలకన్నా మిలటరీ జవానులే అధికంగా ఉండటాన్ని ఆసక్తిగా గమనించాము. ఆ రాష్ట్ర రాజధాని ఎండాకాలంలో శ్రీనగర్‌లోను, చలికాలంలో జమ్ములోను ఉంటుంది జమ్ములో హిందువులు, కాశ్మీర్‌లో ముస్లిములు అధికంగా నివసిస్తుంటారు షర్బత్ తాగి ఉద్ధంపూర్‌కు ప్రయాణమయ్యాము ఉద్ధంపూర్ జమ్ముకి-కాశ్మీర్‌కి మధ్యలో, జమ్మునుండి 62 కిలోమీటర్ల దూరంలో ఉన్నది నిజానికి వైష్ణవి మాత ఆలయానికి వెళ్ళడానికి ఉద్ధంపూర్ వెళ్ళవలసిన అవసరం లేదు.

ముందుగా ఉద్ధంపూర్ వెళ్ళి, అక్కడ భోజనాలు చేసి, ఆలయానికి వెళ్ళవచ్చని రావుగారు చెప్పటంతో, ఉద్ధంపూర్ ప్రయాణం అయ్యాము. రెండు కార్లలో, ముందు వెనుక ఆర్మీవాహనాల రక్షణలో ప్రయాణం చెయ్యటం కొంత భయాన్ని, కొంత 'థ్రిల్'ని కలిగించింది జమ్ములోని ప్రతి కూడలిలోనే కాకుండా, దారిపొడవునా ఎటు చూసినా ఆర్మీ జవాన్లు, కనబడటం ఎంతో ఆశ్చర్యంగానూ, ప్రస్తుత ఆ రాష్ట్ర పరిస్థితికి అద్దం పట్టేదిగానూ ఉన్నది అయితే, అక్కడి ప్రజలు కూడా దీనికి అలవాటుపడ్డట్లు, ఎంతో నిరాసక్తంగా ఎవరి పని వాళ్ళు చేసుకుంటున్నారు.

ఇక్కడి ఉగ్రవాదం గురించి స్వర్ణ వాళ్ళ అన్నయ్యను అడిగితే, శ్రీనగర్‌తో మొదలుపెట్టి ఉద్ధంపూర్ దాకా ఉగ్రవాదం అధికంగా ఉందని, అయితే జమ్ములో కొంత తక్కువ అని చెప్పారు. దానికి కారణం లోయలతో దట్టమైన అడవులతో నిండి ఉన్న కాశ్మీర్‌తో పోలిస్తే, సమతలపు ప్రాంతమైన జమ్ములో ఏదైనా దుశ్చర్య చేసి తప్పించుకుపోవడానికి అవకాశాలు తక్కువ అని తెలిసింది. దారిలో రోడ్డు ప్రక్కన ఉన్న చిన్న కాళీమాత గుడి దగ్గర మా కార్లు ఆగాయి. అయితే అప్పటికే అక్కడ చాలా ఆర్మీవాహనాలు ఉన్నాయి. ఈ దారి గుండా వెళ్ళే ప్రతి ఆర్మీ జవాను ఇక్కడ ఆగి మాతకు నమస్కరించి, ముందుకు వెడతారని రావుగారు చెప్పారు

షుమారుగా రెండు గంటలు ప్రయాణం చేసి, ఉద్దంపూర్ చేరుకున్నాము ఉద్దంపూర్ 80 శాతం ఆర్మీ క్యాంప్ అక్కడ సాధారణ పౌరులు చాలా తక్కువ ఎటు చూసినా ఆర్మీ వాహనాల రొద, జవాన్ల ట్ల టకటకలు. కాశ్మీర్ అంటే జాలువారే జలపాతాలు, కళ్ళుతిరిగే లోయలు అనుకొన్న మాకు ఈ పరిస్థితి కొంత నిరుత్సాహాన్ని కలిగించింది.

రావుగారి ఇల్లు ఒక పర్వతపాదాన ఉన్నది మెయిన్ రోడ్ నుంచి ఆయన ఇంటికి వెళ్ళడానికి మధ్యలో మూడు ఆర్మీ 'బారికేడ్'లు ఉన్నాయి. కొండమీద నుండి తుపాకులతో ఆయన ఇంటిని కాపలా కాస్తున్న సైనికులు కనబడ్డారు. రావుగారి ఇంటికెదురుగా 'ఆర్డినెన్స్ హట్' అని బోర్డు ఉంది 'ఇదేనండి మా పూరిపాక' అన్నారు రావుగారు నవ్వుతూ! ఇంటి బయట విశాలమైన లాన్ ఉంది. మధ్యలో దారి లాన్‌లో ఒక ప్రక్కగా మెత్తటి పరుపులతో ఉయ్యాల ఉంది. బయట గేటు నుండి లోపలి గుమ్మం వరకు దారికి ఇరుప్రక్కలా సువాసనలు వెదజల్లు తున్న అందమైన పూలమొక్కలు ఉన్నాయి స్వర్ణ వాళ్ళ అమ్మా నాన్నగారు, రావుగారి సతీమణి శ్రీమతి అనిత మమ్మల్ని చూసి చాలా సంతోషించారు కుశల ప్రశ్నలు అయ్యాక, అంతా స్నానాలు చేసి భోజనం చేసాము

## కాట్రా

కాసేపు విశ్రాంతి అనంతరం రావుగారి పెద్దబ్బాయి 'బన్ని'ని వెంట తీసుకొని, కారులో వైష్ణవిదేవి ఆలయానికి బయలుదేర్నాము 'కాట్రా' అనే ప్రాంతం దగ్గర మా కారు ఆగింది వైష్ణవిదేవి ఆలయ సందర్శనలో ప్రథమమెట్టు 'కాట్రా'! ఢిల్లీ నుండి వైష్ణవిదేవి యాత్ర నిమిత్తం వచ్చే బస్సులు కూడా కాట్రా వరకు వస్తాయి. అక్కడి నుండి కాలినడకను, గుర్రాలమీద, డోలీల మీద కొండ మీదకు భక్తులు వెడుతుంటారు ఢిల్లీ నుంచి జమ్ముకు 'షాలిమార్ ఎక్స్‌ప్రెస్' అనే రైలు ఉంది. ఆ రైలులో జమ్ముకు వచ్చి, అక్కడి నుండి ప్రయివేట్ బస్సులలో చాలామంది భక్తులు కాట్రా వస్తారు కాట్రానుండి ఆలయం 14 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నది అక్కడ బూట్ల టకటకలకన్నా, గుర్రపు డెక్కల శబ్దం ఎక్కువగా ఉన్నది. అక్కడ ఒక ఆర్మీ రిసెప్షన్ సెంటర్ ఉన్నది మా వెంట వచ్చిన సుబేదార్ మాకు కుర్చీలు వేయించి కూర్చోపెట్టాడు. భక్తులను కొండమీదకు తీసుకు వెళ్ళడానికి అక్కడ గుర్రాలు, డోలీలు లభ్యం అవుతాయి. ఇక్కడ సివిల్ గుర్రాలు, మిలటరీ గుర్రాలు అని రెండు రకాల గుర్రాలు ఉన్నాయి. సివిల్ గుర్రాల కన్నా మిలటరీ గుర్రాలు ఎత్తుగా

బలిష్ఠంగా ఉన్నాయి ఆలయాన్ని సందర్శించే నిమిత్తం వచ్చే మిలటరీ అధికారులు, వారి బంధువుల కోసం మాత్రమే ఈ గుర్రాలను వినియోగిస్తారు దేశంలో సాధారణంగా ప్రతి గుడి దగ్గర కనిపించే బిచ్చగాళ్ళు కానీ, అవినీతి కానీ ఇక్కడ కనిపించక పోవటం విశేషం అంతేగాక, ఏ సీజన్‌లో అయినా ఇక్కడ గుర్రాలకు (రానుపోను రు॥ 180) డోలీలకు (400 రూ॥లు) ఒక్కటే రేటు ఉంటుంది.

## జై మాతాజీ!

అమ్మ గుర్రాన్ని ఎక్కలేకపోవటం వలన, అమ్మకోసం ఒక డోలీని తెప్పించారు ఒక మిలటరీ జవాను అమ్మతోను, ఇద్దరు జవాన్లు మా గుర్రాలతోను నడుచుకుంటు కొండమీదకు వచ్చారు అప్పటికే సూర్యాస్తమయం అవ్వటంతో చీకట్లు ముసురుకున్నాయి. అయితే పూర్తిగా సిమెంట్‌తో చేసిన రోడ్డు, దారి కిరుపక్కలా దుకాణాలతో, దారి ప్రక్కన నడుస్తున్న భక్తులు చేస్తున్న 'జై మాతాదీ' అనే నినాదాలతో, మిలమిలలాడే దీపాలతో ఆ ప్రాంతమంతా పట్టపగలులా ఉంది చిత్రంగా అప్పటిదాకా ఉన్న ఉగ్రవాద భయం అక్కడ మచ్చుకైనా లేదు.

గుర్రాల మీద ప్రయాణం చాలా గమ్మత్తుగా ఉన్నది రద్దీలేని సమయాలలో, దట్టమైన అడవులలోను పర్వత శిఖరాల మీద కాపలా కాసే సైనికులకు ఆహార సామాగ్రి, దుస్తులు ఈ గుర్రాల మీద రవాణాచేస్తుంటారు. దాదాపు నాలుగు గంటల ప్రయాణం అనంతరం కొండమీదకు చేరుకున్నాము

## భైరవ బాబా

అక్కడ గుడిలేదు. అయితే 'గుహ' ఉన్నది. అమ్మవారు ఈ కొండమీద అవతరించడానికి సంబంధించి ఇక్కడ ఒక విచిత్రమైన కథ ప్రచారంరలో ఉన్నది. గతంలో భైరవ బాబా అనబడే ఒక బాబా అమ్మవారిని చూసి, సామాన్య యువతి అని భ్రమపడి, తనను పెళ్ళి చేసుకోమని వేధించేవాడట! అయితే, అమ్మవారు అసలు విషయం చెప్పలేక, ఈ కొండ మీద గల గుహను చీల్చుకొని, దానిలో దాక్కున్నారట. భైరవబాబా అక్కడికి కూడా రావటంతో, అమ్మవారికి అసలు విషయం చెప్పక తప్పలేదట దానితో భైరవబాబా, అమ్మవారిని తనను పెళ్ళి అయినా చేసుకొమ్మని లేదా మృత్యువైనా ప్రసాదించమని వేడుకున్నాడట. అప్పుడు అమ్మవారు అతని శిరస్సును ఛేదించగా, అది కొండమీద మరింత ఎత్తులో పడిందట. అయితే, అమ్మవారు తాను ఇక్కడే అవతరిస్తానని, తన దర్శనం

నిమిత్తం వచ్చే భక్తులు, నీ దర్శనం కూడా చేసుకుంటేనే యాత్ర సఫలం అయినట్లని బాబాకు వరం ఇచ్చారట. అప్పటినుండి అమ్మవారి దర్శనం కొరకు వచ్చే భక్తులు తప్పనిసరిగా భైరవబాబా దర్శనం కూడా చేసుకుంటారు

మాకు కొండమీద 'గెస్టహౌస్' కేటాయించారు కొండమీద భక్తులు వసతి కోసం దాదాపు వంద గదులు ఉన్నాయి అవికాక, కొన్ని సత్రాలు ఉన్నాయి అయితే, ప్రతిరోజు దాదాపు వెయ్యి గుర్రాల మీద పైకి వచ్చే భక్తులకే కాక, కాలి నడకన, డోలీల మీద వచ్చే అసంఖ్యాకమైన భక్తులకు ఆ వసతి చాలదు. అందుకని, కనీసం రెండు నెలల ముందు అక్కడ 'రూములు' బుక్ చేసుకోవాలి. గెస్ట హౌస్‌లో స్నానాలు చేసిన తరువాత, దర్శనానికి ఏర్పాట్లు చేసామని తెలియజేసారు ఆర్మీ సుబేదార్ కొండ మీద వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉన్నది ఇక్కడ ఉగ్రవాదపు తుపాకీ శబ్దాలు లేవు పక్షులు కిలకిలారావాలు తప్ప! ఇక్కడ హిందు-ముస్లిం అగాధాలు లేవు - 'జై మాతాదీ' అనే నినాదాలు తప్ప!!

# ముగురమ్మల మూలపుటమ్మ

అమ్మవారు ఉన్న గుహలోపలికి సన్నని, ఇరుకైన దారి ఉంది. దానిలో వొంగొని వెళ్ళాలి అమ్మవారి దర్శనం నిమిత్తం పెద్ద పెద్ద క్యూలు ఉన్నాయి. అవి తిరుమల క్యూలను పోలి ఉన్నాయి క్యూలో ఉన్న భక్తునకు దాదాపు 10 నుండి 12 గంటల సమయం దర్శనం చేసుకోవడానికి పడుతుంది. కొండ మీద వాతావరణం భక్తుల నినాదాలతో, అదో రకమైన శక్తిని, పవిత్రతను కలిగి ఉంది. భక్తులను ఆర్మీ అధికారులు 'మెటల్ డిటెక్టర్'లతో పరీక్షించి లోపలికి వదులుతున్నారు. మాకు ఆర్మీ పాస్‌లు ఉండటంతో దర్శనం వెంటనే అయ్యింది అక్కడ అమ్మవారి విగ్రహం బదులు మూడు పిండి విగ్రహాలు సరస్వతి, వైష్ణవిమాత, కాళిమాతలు ఉన్నాయి. చీకటి గుహలో, చిన్న వెలుతురులో, పాదాల క్రింద ఎక్కడినుండో వచ్చే చల్లని నీరు శరీరాన్ని ఆహ్లాదపరుస్తుంటే, వైష్ణవిమాత దర్శనం నిజంగా అపూర్వ అనుభూతిని కలిగించే అద్భుతమైన వరం అక్కడ పూజారి భక్తులకు గుప్పెళ్ళతో నాణాలను ప్రసాదంగా ఇస్తారు. ఆ నాణాలను దగ్గర ఉంచుకుంటే, భోగభాగ్యాలు కలుగు తాయని భక్తుల నమ్మకం! దర్శనం తనివితీరా చేసుకొని బయటికి వచ్చాము అందరి హృదయాలలో ఏదో తెలియని ప్రశాంతత, నిర్భయం, ఆనందం. ఈ మార్పు మాకు స్పష్టంగా తెలుస్తోంది. ఈ అనుభూతి చెప్పటం కన్నా, అనుభవించటం నిజంగా అదృష్టం. భోజనం చేసి గెస్టహౌస్‌కి వచ్చి, ప్రశాంతంగా

నిద్రపోయాము

మరునాడు ఉదయమే హారతి దర్శనానికి పాస్‌లు తెచ్చామని జవాన్లు వచ్చారు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు అమ్మవారికి స్తోత్రం చేసి, హారతి ఇస్తారు అయితే ఈ హారతి ప్రత్యక్షంగా అమ్మవారికి కాక మొదటగా అమ్మవారు ఎక్కడినుండి అయితే ఈ కొండను చీల్చుకొని గుహలోకి ప్రవేశించారో, ఆ ప్రవేశ ద్వారానికి ఇస్తారు అక్కడ స్థలం తక్కువగాబట్టి, సుమారు ఇరవై మందిని మాత్రమే 'హారతి దర్శనానికి' అనుమతిస్తారు మాకు ఆ అవకాశం దొరకటం నిజంగా అదృష్టంగా భావించాము. తరువాత అక్కడి నుండి బయలుదేరి, భైరవబాబా దర్శనానికి వెళ్ళాము కేవలం శిరస్సు మాత్రమే ఉన్న భైరవబాబా విగ్రహం మమ్మల్ని అమితంగా ఆకర్షించింది.

## తిరుగు ప్రయాణం

అనంతరం తిరుగు ప్రయాణాన్ని ప్రారంభించాము. కాట్రా నుండి కారులో ఉద్దంపూర్ తిరిగి వెళ్ళి, అక్కడ ఒకరోజు విశ్రాంతి తీసుకొని, శ్రీ రావుగారి దంపతులకు, స్వర్ణవాళ్ళ అమ్మానాన్నలకు మా కృతజ్ఞతలు చెప్పి మా తదుపరి యాత్ర నిమిత్తం ఢిల్లీ బయలుదేరాము

– టి.వి. సురేష్‌బాబు
స్వర్ణలత